www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 07 | జనవరి | 2025
పేజీలు 8

## ఏపూరి ధన్యజీవి

- ఆయన ఆశయాల సాధనకు కృషి చేద్దాం
- ఎంఎల్‌ఏ కూనంనేని



8లో

# రోగం పట్టిన పల్లె..!

## ఆ ఊర్లో ఇంటికో రోగి





-40 ఏళ్లకే వృద్ధాప్యం, కిడ్నీ, ఎముకల వ్యాధితో ఇంటికొకరు
-మెలితిరిగిపోతున్న కాళ్లు.. చక్కెర వ్యాధి పుష్కలం
-అవస్థలు పడుతున్న రామనర్సయ్య నగర్ గ్రామ ప్రజలు

పచ్చని పల్లె కాలుష్యానికి సుదూరంగా ఉన్న ఆ పల్లె పక్కనే నాగార్జున సాగర్ ఎడమ ప్రధాన కాలువ. ఎటు చూసినా పంటలతో భూమికి ఆకుపచ్చని రంగు అద్దినట్లు ఉంటుంది. చూడగానే పల్లె ఇలా ఉండాలి ఇక్కడ ఉంటే బాగుంటుంది అన్న భావన కలుగుతుంది. కాని నాలుగేళ్లుగా ఆ గ్రామస్తులు పడుతున్న కష్టాలను చూస్తే మాత్రం కళ్లు చెమర్చక మానదు. ఒకరు కాదు ఇద్దరు కాదు ఇంటికొకరు ఏదో ఒక వ్యాధితో బాధపడుతున్నారు. గ్రామాన్ని మూత్రపిండాల వ్యాధి వణికిస్తుంది. ఎముకల నొప్పితో బాధపడుతున్న వారు ఇంటికొకరు ఉన్నారంటే అతిశయోక్తి కాదు. కాళ్లు వంకర పోయి, నడుము వంగిపోయి, కర్ర ఊతంగా లేకుండా నడవలేని దయనీయ స్థితి. ఇన్ని అవస్థలు పడుతున్న ఈ పల్లె ఖమ్మంజిల్లాలోని కొణిజర్ల మండల కేంద్రానికి పది కిలో మీటర్ల దూరంలో ఉన్న రామనర్సయ్య నగర్. భూమి లేని నిరుపేదలు పోడు నరికి నిర్మించుకున్న ఈ నవ నిర్మిత గ్రామం ఇప్పుడు అష్టకష్టాలు పడుతుంది.


-ప్రజాపక్షం/ఖమ్మం

2లో

## ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల పంజా







- భద్రతా బలగాల వాహనం పేల్చివేత
- 9 మంది జవాన్లు మృతి
- ఆరుగురికి తీవ్ర గాయాలు, ముగ్గురి పరిస్థితి విషమం
- ముమ్మర గాలింపు చర్యలు

ప్రజాపక్షం/భద్రాచలం : ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు పంజా విసిరారు. పోలీసులే లక్ష్యంగా చేసుకుని అమర్చిన ఐఇడి బాంబు పేల్చడంతో 15 మంది జవాన్లు ప్రయాణిస్తున్న వాహనం తునాతునకలై పోయింది. బీజాపూర్ జిల్లా కుత్రభద్రే అటవీ ప్రాంతంలో సోమవారం చోటుచేసుకున్న ఈ ఘటనలో డ్రైవర్‌తో సహా మొత్తం 9 మంది జవాన్లు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఆరుగురు జవాన్లకు తీవ్ర గాయాల పాలయ్యారు. వీరిలో ముగ్గురి పరిస్థితి అత్యంత విషమంగా ఉంది. గాయాలపాలైన వారిని మెరుగైన వైద్య కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనను ఐజి సుందర్ రాజన్ ధృవీకరించారు. వివరాల ప్రకారం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టుల ఏరివేతలో భాగంగా దంతెవాడ డిఆర్‌జి భద్రతా బలగాలు పెద్ద ఎత్తున కూంబింగ్

మిగతా 2లో..

## కొత్త సహకార సంఘాల ఏర్పాటు

-పెద్ద సంఘాలను విడగొడుతున్న ప్రభుత్వం
-ఖమ్మంజిల్లాలో 31 - భద్రాద్రి కొత్తగూడెంజిల్లాలో 17 సంఘాల ఏర్పాటు



ప్రజాపక్షం/ఖమ్మం : ఖమ్మంజిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు విభజనకు సంబంధించి ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నారు. పెద్ద సంఘాలుగా ఉన్న వాటిని ఆయా సంఘాల స్థాయిని బట్టి రెండు, మూడు సంఘాలుగా విభజించి రైతులకు మరిన్ని సేవలు త్వరిత గతిన అందించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతుంది. ఇందుకు సంబంధించి ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నారు. ఖమ్మం కేంద్ర సహకార బ్యాంకు పరిధి నాలుగు జిల్లాలకు విస్తరించింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లోని సహకార సంఘాలు ఖమ్మం డిసిసిబి పరిధిలో ఉన్నాయి. మొత్తం 101 సహకార

మిగతా 2లో..

# రోగం పట్టిన పల్లె..!

**ప్రజాపక్షం/ఖమ్మం :** కరోనా తర్వాత కొత్త కష్టాలు సరికొత్త జబ్బులు యావత్ దేశాన్ని ఇబ్బందిపెడుతున్నట్లుగానే రామనర్సయ్య నగర్ గ్రామాన్ని నాలుగేళ్ల నుంచి వివిధ వ్యాధులు చుట్టుముట్టాయి. దీనితో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. కాయకష్టం చేసిన వారు చూస్తుండగానే కదలలేని స్థితికి చేరుకున్నారు. మూత్రపిండాలు వాపు రావడం లేదా కుచించుకుపోవడం ఇతరత్రా కారణాలతో శరీరం వాపు వచ్చి తీవ్రమైన వేదనకు గురవుతున్నారు. ఖమ్మం, విజయవాడ, హైదరాబాద్ నగరాల్లోని ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ ఆర్థిక ఇబ్బందులు పడుతూ వ్యాధులను తగ్గించుకునేందుకు పాట్లు పడుతున్నారు. ఈ గ్రామంలో నూటికి 90శాతం మంది పేదలే. గిరిజన జనాభా కూడా ఎక్కువే. పోడు సాగుపైనే ఆధారపడి జీవించే ఈ గ్రామస్తులను ఒక్కసారిగా వ్యాధులు చుట్టుముట్టడంతో సరైన వైద్యం పొందలేక, శరీరక బాధలు భరించలేక మానసికంగా కుంగిపోతున్నారు. 40 ఏళ్లకే వృద్ధులుగా మారిపోతున్నారు. ఎముకల వ్యాధితో కాళ్లు మెలితిరిగిపోయి నడవలేని స్థితికి నెట్టివేయబడుతున్నారు. దీనికి తోడు కాయకష్టం చేసే వారిని చక్కెర వ్యాధి సైతం ఇబ్బందిపెడుతుంది. 30 నిమిషాలు నడిస్తే చక్కెర వ్యాధి నియంత్రణలో ఉంటుందని చెబుతున్న ఈ రోజుల్లో రోజంతా పని చేసే వారిని ఈ వ్యాధి వేధిస్తుండడం శోచనీయం. పక్షవాతం, చాలా మందికి వచ్చి కాళ్లు, చేతులు చచ్చుపడిపోయాయి. ఇవి చాలవన్నట్లు గ్రామంలో 50 శాతం మందికి క్రమంగా కంటిచూపు తగ్గిపోయింది. నాలుగైదేళ్ల క్రితం వరకు ఆరోగ్యంగా ఉన్న ఈ పల్లెకు ఇప్పుడు ఈ దుస్థితి ఎందుకు వచ్చిందో అర్థం కావడం లేదు. కరోనా తర్వాత మినరల్ వాటర్ ఎక్కువగా వాడుతున్నారని మినరల్ వాటర్ వల్లనే వ్యాధుల బారీన పడ్డామని కొందరు అంటుండగా మిషన్ భగీరథ నీరు వాడుతున్న వారిలో కూడా జబ్బులు రావడం గమనార్హం. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో 80 శాతం మంది ప్రజలు ఏదో ఒక వ్యాధితో ఇబ్బందులు పడుతున్న తీరును గమనించి గ్రామంలో పల్లె దవాఖానాను ఏర్పాటు చేయాలని ఎముకలు, మూత్రపిండాలు, ఇతర వ్యాధులకు సంబంధించి ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. గ్రామస్తులకు సోకిన వ్యాధులను దృష్టిలోఉంచుకుని ఆరోగ్యశ్రీ ద్వారా అన్ని ఆసుపత్రుల్లో వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**40ఏళ్లకే వృద్ధుడిలా...**



అంగోత్ పుల్యా వయస్సు 42 ఏళ్లు. కాయకష్టం చేసి కుటుంబాన్ని పోషించుకునే పుల్యాకు మూడేళ్ల క్రితం పక్షవాతంలా వచ్చింది. కాలు చచ్చుపడిపోయింది. వైద్య సేవలు పొందుతుండగానే మాట పడిపోయింది. పుల్యా ఇప్పుడు మాట్లాడలేడు, నడవలేడు. ఆయనపై ఆధారపడిన ఆ కుటుంబ పరిస్థితి దయనీయంగా మారింది. వైద్యం పొందేందుకు ఆర్థిక పరిస్థితి బాగాలేక నానా ఇబ్బందులు పడుతున్నారు.

**మూత్రపిండాల వ్యాధి ఈ స్థితికి చేర్చింది...**



గుగులోత్ టోక్యా నాలుగేళ్ల క్రితం వరకు ఆరోగ్యంగా ఉండి కాయకష్టం చేసేవాడు. భూమి కౌలుకు తీసుకుని కుటుంబాన్ని పోషించుకునే టోక్యాకు కాళ్ల నొప్పులతో మొదలై ఇప్పుడు నడవలేని స్థితికి చేరుకున్నాడు. కిడ్నీ వ్యాధి కారణంగా ఏ పని చేయలేక కుటుంబానికి భారంగా మారాడు. 45 ఏళ్ల వయస్సులోనే వృద్ధుడిగా మారిపోయాడు.

**ఒళ్లంతా మంటలతో ఇబ్బందిపడుతున్న లాక్యా...**



ధర్మసోత్ లాక్యా వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకునే వాడు. కొద్ది నెలల క్రితం అరికాళ్ల మంటలు వచ్చాయి. ఏదో వ్యాధి సోకిందని ఆసుపత్రికి వెళితే ఒక కిడ్నీ చెడిపోయిందని ఆపరేషన్ అవసరం అంటున్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో కుటుంబ పోషణకు కష్టమైన పరిస్థితుల్లో ఆపరేషన్ చేయించుకునే స్థితి లేక బాధను అనుభవిస్తూ కాలం గడుపుతున్నాడు.

**శరీరమంతా వాచి ఇబ్బందిపడుతున్న విజయ...**



గుగులోత్ విజయకు 30 ఏళ్ల వయస్సు ఉంటుంది. కొద్ది రోజుల క్రితం శరీరంలో దురదలు వచ్చాయి. ఆ తర్వాత ఒళ్లు మొత్తం పాము పొడల మాదిరి శరీరమంతా వ్యాపించింది. దానికి తోడు శరీరం వాపు రావడంతో ఖమ్మంలోని వైద్యులను సంప్రదిస్తే ఓ కిడ్నీ చెడిపోయింది కిడ్నీ ఆపరేషన్ అవసరమన్నారు. రెక్కాడితే కాని డొక్కాడని విజయ కుటుంబం వైద్య సాయం పొందలేక భగవంతుని పై భారం వేస్తూ కాలం గడుపుతున్నారు.

**పల్లె దవాఖానా ఏర్పాటు చేయాలి : కంపసాటి వెంకన్న**



గ్రామాన్ని వ్యాధులు చుట్టుముట్టడంతో గ్రామంలో పల్లె దవాఖానాను ఏర్పాటు చేసి నిరంతరం వైద్య సేవలను అందించాలని సిపిఐ మండల నాయకులు, రామనర్సయ్య నగర్ గ్రామవాసి కంపసాటి వెంకన్న కోరారు. నాలుగేళ్లుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్న అధికార యంత్రాంగం ఈవైపు కన్నెత్తి చూడలేదన్నారు.ఈ వ్యాధులకు కారణం ఏమిటో అన్వేషించాలని తద్వారా నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

**వైద్య శిబిరం ఏర్పాటు చేయాలి : శివ**



వైద్య శిబిరం ఏర్పాటు చేసి వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారికి తక్షణం వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ గ్రామశాఖ కార్యదర్శి గుగులోత్ శివ కోరారు. పేదవారు కావడంతో ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్య సాయం పొందలేకపోతున్నారని దీనితో అధికారులు వైద్య సాయం అందేవిధంగా తగు చర్యలు చేపట్టాలని కోరారు.

# కొత్త సహకార సంఘాల ఏర్పాటు

(మొదటిపేజీ తరువాయి)

ఉండగా వీటిలో కొన్ని విశాల సహకార పరపతి సంఘాలు మరికొన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయి. ఆంధ్రాబ్యాంక్ కర్షక పరిషత్ లిమిటెడ్‌ను విభజించి బల్లేపల్లి కేంద్రంగా మరో సహకార సంఘాన్ని ఏర్పాటు చేయనున్నారు. పిఏసిఎస్ వివిపాలెంను విభజించి అల్లిపురం, చింతగుర్తి సొసైటీలను కొత్తగా ఏర్పాటు చేయనున్నారు. మంచుకొండ సొసైటీని చిమ్మపుడి, ఈర్లపుడి సొసైటీలను కొత్తగా ఏర్పాటు చేయనుండగా, ఏదులాపురం సొసైటీని ఏదులాపురం, ఎంవిపాలెం, కామంచికల్ సంఘాలుగా విభజించనున్నారు. కూసుమంచి మండల పరిధిలోని కల్లూరిగూడెం సొసైటీని పెరికసింగారం, పాలేరు, కల్లూరిగూడెం సంఘాలుగా నేలకొండపల్లి సొసైటీని కట్టుకాచారం, రాయగూడెం, నేలకొండపల్లి సొసైటీలుగా, తిరుమలాయపాలెం సొసైటీని జల్లేపల్లి, కొక్కిరేణి సొసైటీలను ఏర్పాటు చేయనున్నారు. బీరోలు సొసైటీ నుంచి సుబ్లేడు, కాకరవాయి సొసైటీలను కొత్తగా ఏర్పాటు చేయనుండగా చింతకాని సొసైటీ నుండి పందిళ్లపల్లి, ప్రొద్దుటూరు సొసైటీలను, ముదిగొండ సొసైటీ నుండి బాణాపురం, పమ్మి సొసైటీలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్దం చేశారు. ఎఫ్ఎస్‌సిఎస్ మధిర నుండి సిరిపురం సొసైటీని కొత్తగా ఏర్పాటు చేయనుండగా ఏన్కూరు మండలం గార్లొడ్డు సొసైటీని విభజించి బురదరాఘవాపురం, నాచారం సొసైటీలను ఏర్పాటు చేయనున్నారు. కారేపల్లి సొసైటీని విడదీసి మాణిక్యారం, కమలాపురం సొసైటీలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధం కాగా కొణిజర్ల మండలం గోపవరం సొసైటీని విభజించి సింగరాయపాలెం, పెద్ద గోపతి సొసైటీలను ఏర్పాటు చేయనున్నారు. వైరా విశాల సహకార పరపతి సంఘాన్ని విభజించి గొల్లపూడి కేంద్రంగా మరో సంఘాన్ని ఏర్పాటు చేయనున్నారు. కల్లూరు సహకార సంఘాన్ని విభజించి యజ్ఞ నారాయణపురం సహకార సంఘాన్ని, తల్లాడ సహకార సంఘాన్ని విభజించి కొత్తగా బిల్లుపాడు, కారాయిగూడెం సొసైటీని విభజించి కుప్పెనకుంట్ల సొసైటీగా ఏర్పాటు చేయనున్నారు.పెనుబల్లి సొసైటీని విభజించి లంకపల్లి, కెజిమల్లెలను విభజించి అడసర్లపాడు, కామేపల్లి సొసైటీని విడగొట్టి లింగాల సొసైటీని కొత్తగా ఏర్పాటు చేయనున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గతంలో 18 సహకార సంఘాలు ఉండగా ఇప్పుడు 35 సహకార సంఘాలను ఏర్పాటు చేయనున్నారు. బూర్గంపాడు సహకార సంఘ పరిధిలో అదనంగా మోరంపల్లి బంజర, నాగినేనిపోలు సొసైటీలను, చర్ల సొసైటీ పరిధిలో మొగళ్లపల్లి సొసైటీని, నారాయణపురం సొసైటీ పరిధిలో మామిళ్లవారిగూడెం సొసైటీని ఏర్పాటు చేయనున్నారు. పిఏసిఎస్ సత్యనారాయణ పురం పరిధిలో కుందురు, తేగడ, పాల్వంచ పరిధిలో నాగారం, యానంబైలు, పినపాక సొసైటీ పరిధిలో జానంపేట, కరకగూడెం సొసైటీలను ఏర్పాటు చేయనుండగా, అశ్వాపురం పరిధిలో మిట్టగూడెం, అమెర్దా సొసైటీలను, నెల్లిపాక పరిధిలో తుమ్మల చెరువు, మొండికుంట, దుమ్ముగూడెం సొసైటీ పరిధిలో పర్ణశాల, నర్సాపురం, ఇల్లందు సొసైటీ పరిధిలో రొంపెడు, కొత్తగూడెం సొసైటీని, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్ సొసైటీలుగా విభజించనున్నారు. మణుగూరు సొసైటీని రామనుజవరం, గుండాల సొసైటీని ఆళ్లపల్లి, బేతంపూడి సొసైటీని బోడు, కోయగూడెం, బొమ్మనపల్లి సొసైటీలుగా ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. గుంపెన సొసైటీని చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, ముల్కలపల్లి సొసైటీని జగన్నాథపురం, పోగళ్లపల్లి, పుసుగూడెం సొసైటీలుగా విభజించనున్నారు. జూలూరుపాడు సొసైటీని పడమటి నర్సాపురం, కాకర్ల, పాపకొల్లు సొసైటీలుగా, దమ్మపేట విశాల పరపతి సంఘాన్ని నాచారం, మొద్దులగూడెం, గండుగులపల్లి సొసైటీలుగా విభజించనున్నారు.

# ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల పంజా

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా గత వారం రోజులుగా బలగాలు అడవిని జల్లెడపడుతున్నాయి. ఈ కూంబింగ్‌లో భాగంగా అడుగడుగునా సోదాలు నిర్వహిస్తుండగా గత రెండుమూడు రోజులుగా పలు చోట్ల మందుపాతరలను కనుగొన్న భద్రతా బలగాలు వాటిని నిర్వీర్యం చేశాయి. కూంబింగ్ ముగించుకుని పికప్ వాహనంలో జీజాపూర్ జిల్లా కుద్రభద్రే అటవీ మార్గంలో భద్రతా బలగాలు ప్రయాణిస్తున్నాయి. కాగా అప్పటికే అమర్చి ఉన్న మందు పాతరలను అతి సమీపం నుండి పేల్చడంతో వాహనం ఒక్క సారిగా 50 మీటర్లు పై బడి ఎగిరిపడింది. వాహన శకలాలు, జవాన్ల అవయా భాగాలు చెట్లపై వేలాడాయి. బాంబు పేలుడు ధాటికి ఆ ప్రదేశంలో 20 మీటర్ల లోతులో గొయ్యి పడింది. దీంతో ఎంత శక్తివంతమైనన బాంబు పేల్చారో అనేది అర్థమవుతోంది. ఈ పేలుడు ధాటికి బలగాలు ప్రయాణిస్తున్న వాహనం తునాతునకలై కిలోమీటర్‌కు పైగా శకలాలు ఎగిరిపడ్డాయి. డిఆర్‌జి జవాన్ల మృతదేహాలు మాంసపు ముద్దల్లా చెల్లాచెదురయ్యాయి. ఘటనా స్థలంలో భయానక పరిస్థితి కనిపిస్తోంది. ఈ ఘటనలో సుమారు 20 నుండి 30 మంది మావోయిస్టుల అతి సమీపం నుండి దాడికి పాల్పడినట్లు పోలీసు ఉన్నతాధికారులు భావిస్తుండగా, మావోయిస్టులు సైతం గాయాల పాలైనట్లు తెలుస్తోంది. సమీప అడవుల్లోకి మావోయిస్టులు జారుకున్నట్లు అనుమానిస్తున్న భద్రతా బలగాలు సంఘటనా స్థలం నుండి పెద్ద ఎత్తున కూంబింగ్ ఆపరేషన్ మొదలుపెట్టాయి. సంఘటనా స్థలానికి అదనపు బలగాలతో పాటు పోలీస్ ఉన్నతాధికారులు చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఇదిలా ఉండగా ఏడాది కాలంగా పెద్ద ఎత్తున ఎదురుదెబ్బలు తింటున్న మావోయిస్టు పార్టీ సుమారు 250 మందిని కోల్పోయింది. చాలా సార్లు ప్రతిఘటించేందుకు ప్రయత్నించినప్పటికీ వెనుకడుగు వేయాల్సి వచ్చింది. బేస్ క్యాంపులపై దాడులు చేసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. గత మూడు నాలుగు రోజుల క్రితం పోలీసులను ఏమార్చేందుకు మందుపాతరలు కనిపించేలా అమర్చినట్లు అనుమానాలు వస్తున్నాయి. వాటిని కనుగొన్న బలగాలు నిర్వీర్యం చేశాయి. దీంతో ఇక ముప్పు ఉండదని భావించిన బలగాలు కూంబింగ్ ముగించుకుని కుద్రభద్రే అటవీ మార్గం ద్వారా వాహనంలో తిరుగు ప్రయాణం అయ్యారు. ఆ ప్రాంతంలో ఒక్కసారిగా ఐఇడి బాంబు పేల్చడంతో పోలీసులు ప్రయాణిస్తు వాహనం తునాతునకలై పోయింది. ప్రయాణించే మార్గంలో బాంబు స్క్వాడ్ తనిఖీలు నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నప్పటికీ ఘటన జరిగే మార్గంలో తనిఖీలు చేయకపోవడం వల్లే తీవ్ర నష్టాన్ని చవి చూడాల్సి వచ్చిందని విశ్లేషకులు భావిస్తున్నారు. సేఫ్‌జోన్‌గా భావించే అబూజ్మడ్ అడవుల్లో మావోయిస్టు నేతలు తిష్టవేసి పక్కా ప్లాన్ ప్రకారమే ఈ దాడికి పాల్పడినట్లు ప్రచారం సాగుతోంది. మావోయిస్టు పార్టీని ఛత్తీస్‌గఢ్ అడవుల్లో నుండి పూర్తిగా తుడిచిపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వంతో పాటు ఆ రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర కృషి చేస్తూ ముందుకు సాగుతున్న క్రమంలో మావోయిస్టులు ఒక్కసారిగా విరుచుకుపడి తమ ఉనికిని చాటుకున్నట్లు అయ్యింది.

## కలెక్టర్‌ను అభినందించిన ఎంఎల్‌ఏ కూనంనేని



**ప్రజాపక్షం/భద్రాచలం :** కొత్తగూడెం మున్సిపల్ కార్పోరేషన్ ఏర్పాటయ్యేందుకు నివేదికలలను సమర్పించి కృషి చేసిన కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను కొత్తగూడెం ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అభినందించారు. ఈ మేరకు సోమవారం ఆయనను ప్రత్యేకంగా కలుసుకున్న కూనంనేని షాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిబద్దత గల అధికారులు ఉంటే ప్రజలకు ఏఏ అవసరాలు ఉన్నాయో గుర్తిస్తాని, అందుదక్కట్లుగా ప్రజాప్రతినిధులతో మమేకమై ముందుకు సాగి నివేదికలు ప్రభుత్వానికి సమర్పించి పనులు జరిగేలా చూస్తారని చెప్పారు.ఆ కోవకు చెందిన వారే కలెక్టర్ జితేష్ వి పాటిల్ అని, ఆయన సేవలను కొత్తగూడెం నియోజవర్గం తరుపున అభినందిస్తున్నట్లు కూనంనేని చెప్పారు.

## ప్రజాపక్షం క్యాలెండర్ ఆవిష్కరణ




**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** లక్ష్మీదేవిపల్లి మండల కేంద్రంలో సోమవారం ప్రజాపక్షం 2025 నూతన క్యాలెండర్‌ను లక్ష్మీదేవిపల్లి ఎంపిడివో చలపతి రావు, సిఐ రాయల వెంకటేశ్వర్లు, తహాశీల్దార్ కెఆర్‌కెవి.ప్రసాద్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలను చైతన్యవంతం చేస్తూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారదిగా ప్రజాపక్షం పనిచేస్తుందని అన్నారు. నేటి సమాజంలో జరుగుతున్న అవినీతిని, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న పత్రిక సేవలు వెలకట్టలేని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం రిపోర్టర్ చంద్రగిరి ప్రసాద్ రావు, ఆర్ఐ కె.శివకృష్ణ, కానిస్టేబుల్ చందు, బైకాని కృష్ణ పాల్గొన్నారు.

# తుళ్లూరు సత్యం సేవలు మరువలేనివి

## సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం



**ప్రజాపక్షం/కొణిజర్ల :** సిపిఐ సీనియర్ నాయకులు తుళ్లూరు సత్యం గ్రామానికి చేసిన సేవలు మరువలేనివని సిపిఐ జాతీయసమితి సభ్యులు బాగం హేమంతురావు అన్నారు. మండల పరిధిలోని తనికెళ్లలో తుళ్లూరు సత్యం 18వ వర్ధంతి సభను తనికెళ్లలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు పార్టీకోసం ఆయన ఆస్తులను కూడా త్యాంగా చేశారని అన్నారు. తనికెళ్ల గ్రామానికి ఎంతో చరిత్ర ఉందని పార్టీ బలంగా ఉండేందుకు ఆనాటి నాయకులు అందరు ఐక్యంగా పనిచేశారని కొనియాడారు. కమ్యూనిస్టుపార్టీ ఏంసాధించిందని కొంతమంది అవహేళన చేస్తున్నారని అన్నారు. కాని పేదప్రజలకు ఈ మాత్రమైన సంక్షే ఫలాలు అందుతున్నాయంటే అది కమ్యూనిస్టు పార్టీ పోరాటాలవలనే అని అన్నారు. దున్నేవాడికే భూమికావాలని కమ్యూనిస్టుపార్టీ నిర్వహించిన భూపోరాటాల ఫలితంగానే భూసంస్కరణ చట్టం వచ్చిందని అన్నారు. చంద్ర రాజేశ్వరరావు నాయకత్వంలో చేసిన భూపోరాటం వలనే కొన్ని లక్షల ఎకరాలు భూమి పేదలకు దక్కిందని అన్నారు. పండిగి , ఈర్లపూడి, వినోభానగర్, గుబ్బగుర్తి, మొండికుంటు తదితర ప్రాంతాల్లో భూమి దక్కిందని అన్నారు. కమ్యూనిస్టుపార్టీల పోరాటంతోనే ఉపాధిహామి చట్టం వచ్చిందని నాడు పార్లమెంట్‌లో 64 మంది వామపక్ష పార్లమెంట్ సభ్యులు ఉండటంవలనే చట్టం అమలయిందని పేర్కొన్నారు. గిరిజనులకు అటవీహక్కుల పరిరక్షణ చట్టం వచ్చిందని నాగార్జునసాగర్, నందికొండ ప్రాజెక్టుల నిర్మాణం కూడా కమ్యూనిస్టుపార్టీ పోరాటఫలితమేనని అన్నారు, పారిశ్రామికంగా అభివృద్ధి చెందేందుకు విశాఖ ఉక్కుఫ్యాక్టరీ నిర్మాణం కోసం కమ్యూనిస్టుపార్టీ శాసనసభ్యులు 24 మంది శాసనసభ్యత్వానికి కూడా రాజీనామా చేశారని గుర్తు చేశారు. కమ్యూనిస్టుపార్టీ పాత్ర లేకుండా ఏది జరగలేదని, తెలంగాణా సాయుధపోరాటంతోనే తెలంగాణకి విముక్తి కలిగిందని పేర్కొన్నారు. గతసంవత్సరం డిశంబర్ 26న సిపిఐ శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. నేటియువతకూడా కమ్యూనిస్టుపార్టీ ఆశయసాధనకోసం పాటుపడాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ తనికెళ్ల గ్రామశాఖ కార్యదర్శి యసా వెంకటేశ్వరరావు, జమ్ముల జితేందర్‌రెడ్డి, తాటి వెంకటేశ్వర్లు, యర్రా బాబు, రైతుసంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు,, పోటు కళావతి, ఏపూరి లతాదేవి, గడల సీతారామయ్య, పివిరావు, ఎస్టీయు ఉపాధ్యాయ సంఘం నాయకులు గడల భాస్కర్‌రావు, లేడిబోయిన గోపాల్‌రావు, విశ్రాంత ఉపాధ్యాయుడు కొణపర్తి విష్ణుమూర్తి, కూచిపూడి రవి, మోత్కూరి వెంకయ్య, గడల శ్రీనివాసరావు, పాపిట్ల ఏసు, పసుమర్తి శంకర్‌రావు, పిన్నం పుల్లయ్య, బాసా నాగరాజు, కొలుపుల సాంబయ్య, షేక్ సైదులు, కట్లసత్యం, సత్యం కుమారులు తుళ్లూరు ప్రసాద్, తుళ్లూరు మురళీ, మాలతీ పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

## -జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్ లేకుండా త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమ సందర్భంగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్లు డా॥ పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డిలతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. సత్తుపల్లి మండలం గంగారం పిహెచ్‌సికి చెందిన ఎన్. మారేశ్వరి తాను కాంటిన్జెంట్ వర్కర్‌గా పనిచేస్తున్నానని నెలకు ఐదు వేల రూపాయల వేతనం ఉందని గత 30 నెలలుగా హెచ్‌డిఎస్ బడ్జెట్ లేదని వేతనం ఇవ్వడం లేదని పెండింగ్ వేతనం ఇప్పించాలని, ఫుల్ టైం వర్కర్‌గా నియమించాలని దరఖాస్తు చేశారు. తల్లాడ మండలం కలకోడిమ గ్రామానికి చెందిన అదూరి శిరీష ఎస్సి కుటుంబానికి చెందిన నిరుపేద మహిళనని గతంలో ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇల్లు కొరకు దరఖాస్తు చేసుకున్నానని ప్రస్తుతం సర్వేలో తన పేరు రాలేదని తనకు ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. కారేపల్లి మండలంకు చెందిన బాదవత్ రాము ఏన్కూరు మండలం గార్లొడ్డు గ్రామంలోని లక్ష్మి నర్సింహా స్వామి ఆలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న నారాయణరావును పరిశ అనంతరామయ్య ట్రస్టుకు చేసిన అక్రమ డిప్యూటేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఆయా దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్ సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిఆర్‌డివో సన్యాసయ్య, డిఆర్‌వో రాజేశ్వరి, కలెక్టరేట్ ఏవో అరుణ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి నేత వ్యాఖ్యల పట్ల కాంగ్రెస్ నిరసన

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీపై బిజెపి నేత వ్యాఖ్యాలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ కమిటీ, జిల్లా మహిళా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవనం నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బిజెపి మాజీ ఎంపి రమేష్ బిధూరి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా మాట్లాడుతూ బిజెపి నాయకులకు మహిళలంటే చిన్నచూపని వారు ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బిజెపి మాజీ ఎంపి ఢిల్లీ అసెంబ్లీ కల్కాజి బిజెపి అభ్యర్థి రమేష్ బిధూరి ఎంపి ప్రియాంక గాంధీపై చేసిన అనుచిత వ్యాఖ్యాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రమేష్ టికెట్‌ను రద్దు చేసి రానున్న రోజుల్లో ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలన్నారు. బిజెపి ప్రభుత్వం మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఢిల్లీలో నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పుచ్చకాయల వీరభద్రం, మొక్కా శేఖర్ గౌడ్, బొందయ్య, సయ్యద్ గౌస్, కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, పల్లెబోయిన భారతిచంద్రం, కన్నం వైష్ణవి ప్రసన్న, గజ్జెల్లి వెంకన్న, ప్రతిభారెడ్డి, భవాని, రమాదేవి, జ్యోతి, నాగమణి, నీలవేణి, సుగుణ, ఉమాదేవి, జ్యోత్స్న, సమీరా, రహెమా, బండి నాగేశ్వరరావు, ఏలూరి రవి కుమార్, కిలారు అనిల్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



# రైతుల కోసం బిఆర్ఎస్ ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉంది..

**ప్రజాపక్షం/ తల్లాడ :** పదేళ్లు అధికారంలో ఉండి రైతులను మోసం చేసిన బిఆర్ఎస్ నేడు రైతుల కోసం ధర్నాలు చేయటం విడ్డూరంగా ఉందని ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు కటికి కిరణ్‌కుమార్ విమర్శించారు. ఆనాడు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ లక్షరూపాయలు రుణమాఫీ చేస్తామని చెయ్యకుండా రైతులను మోసం చేసిందన్నారు. సన్నవడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ ఇచ్చి రైతును ఆదుకున్నదని కాంగ్రెస్ ప్రభుత్వమని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేస్తున్న మేలు చూసి ఓర్వలేక బిఆర్ఎస్ ఏదో ఒక ధర్నా చేస్తుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్నప్పుడు ఏనాడు రైతులను పట్టించుకోని బిఆర్ఎస్ నాయకులు ఈరోజు రైతుల కోసం ధర్నాలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో రైతులు ఆనందంగా ఉన్నాయని రైతును రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు.

# భూమి లేని నిరుపేదలకు రూ.12 వేలు ఇవ్వాలి



**ప్రజాపక్షం/బోనకల్:** తెలంగాణ రాష్ట్రంలోని భూమిలేని నిరుపేదలకు తక్షణమే రూ. 12 ఇవ్వాలని సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఆకెన పవన్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ప్రజావాణి అధికారులను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూమి లేని నిరుపేదల సంక్షేమం గురించి ప్రజాపాలన ప్రభుత్వం ఆలోచిస్తుందని డిప్యూటీ సిఎం మల్లు భట్టీ విక్రమార్క తెలిపారని అన్నారు. ప్రభుత్వం భూమి లేని నిరుపేదలకు ప్రతి కుటుంబానికి ప్రతి యేటా రూ.12 వేలు అందజేస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం రోజైన డిసెంబర్ 28న రూ.12 వేలు ఇచ్చే పథకాన్ని శ్రీకారం చేపడతామని, మొదటి విడతలో రూ. 6వేలు, రెండవ విడతలో మరో రూ.6వేలు ఇస్తామని డిప్యూటీ సిఎం, ఆర్థిక, విద్యుత్ శాఖ మాత్యులు మీడియా ముఖంగా తెలిపారని అన్నారు. తక్షణమే ప్రభుత్వం చర్యలు చేపట్టి భూమి లేని నిరుపేదలకు మొదటి విడత రూ.6 వేలు అందజేయాలని కోరారు. వీటితో ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. రైతులకు సక్రమంగా రుణమాఫీ జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అర్హులైన ప్రతి రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు గుంపుల జయరాజు, యంగల గిరి తదితరులు పాల్గొన్నారు.

# మిరపను ఆశిస్తున్న నల్లతామర



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మిరప పంట ప్రస్తుతం జిల్లాలో పూత, కాయ దశలో ఉందని సాధారణంగా మిరపలో తామర పురుగు ఆశిస్తుందని కాని గత రెండు సంవత్సరములనుంచి కొత్తగా నల్లతామర ఆశిస్తున్నట్లు గమనించడం జరిగిందని కొణిజర్ల మండల వ్యవసాయాధికారి బాలాజీ తెలిపారు. సోమవారం మండల పరిదిలోని అంజనాపురంలోని మిర్చి తోటను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు నల్లతామర ప్రధానంగా ఆకులమీద, పువ్వులలో ఎక్కువసంఖ్యలో చేరి రసం పీల్చుతుందని ఆకులపైభాగంలో పసుపురంగుకుమారి కిందిభాగం గోధుమ రంగులోకి మారుతుందని అన్నారు. దీనివలన కాయలు వచ్చేసంఖ్య తుగ్గుతుందని, కాయల నాణ్యతకూడా తగ్గుతుందని నల్లతామర యొక్క ఉనికి గుర్తించి సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలని అన్నారు. అధిక నత్రజని ఎరువులు వేసుకోవద్దని, పొలంగట్లమీద కలుపుమొక్కలు నిర్మూలించాలని, సామూహికంగా నీలిరంగు జిగురు అట్టలను ఎకరానికి 40 నుంచి 50 వరకు పెట్టుకోవడం ద్వారా పురుగు ఉధృతిని తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. వేపసంబందిత ద్రావణాన్ని పిచికారి చేసుకోవాలని అన్నారు. సస్యరక్షణ మందులైన సయాంట్రానిలిప్రోల్1.2 మి.లీ లేదా స్పైనోసాడ్ 0.32 మి.లీ, లేదా ఫిప్రోనిల్ 5 ఎస్‌సి 2 మి.లీ. ఫిప్రోనిల్ 80 wg,0.2 గ్రాములు, ఫిప్రోనిల్ ప్లస్ ఇమిడాక్లోప్రిడ్ 0.2గ్రాములు, ఎసిటామిప్రిడ్ 0.2, 0.25గ్రా, స్పైనటోరం 1 మి. లీ. స్పైరోటే ట్రమాట్ 0.8 గ్రాములు లీటరు నీటికి కలిపి మందులను మారుస్తూ పిచికారి చేయాలని అన్నారు. ఈకార్యక్రమంలో రైతులు చల్లగొండ సురేష్, రమేష్ పాల్గొన్నారు.

# రూ.2లక్షల రుణమాఫీ అమలు చేయడంలో ప్రభుత్వం విఫలం : సండ్ర



**ప్రజాపక్షం/ తల్లాడ :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల నెరవేర్చటంలో విఫలమైందని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య విమర్శించారు. సోమవారం తల్లాడ మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కేటిఆర్ ఇచ్చిన పిలుపు మేరకు బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రైతులకు రూ.2లక్షలు రుణమాఫీ చేస్తానని గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం నేటి వరకు పూర్తిస్థాయిలో అమలు కాలేదని, కళ్యాణలక్ష్మీ పథకం బిఆర్ఎస్ ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తే ఆరోజు విమర్శించిన కాంగ్రెస్ నాయకులు, పెళ్లైన ఆడపడుకు తులం బంగారం లక్షరూపాయలు నగదు ఇస్తానని హామీ ఇచ్చి నేటి వరకు ఎక్కడ అమలు చేసిన దాఖలాలులేవని, 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 20హామీలు కూడా నెరవేర్చలేదని విమర్శించారు. పేరుకే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమని, గ్రామాల్లో ఎక్కడ బస్సులు తిరిగే పరిస్థితి లేకుండా పోయిందని, ప్రధాన పట్టణాలకు వెళ్లే సంఖ్య కూడా పూర్తిస్థాయిలో తగ్గించారని ఆయన ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వీర మోహన్‌రెడ్డి, మాజీ ఎంపిపి దొడ్డ శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకులు దుగ్గిదేవర వెంకటలాల్,వెంకన్న,శ్రీనివాసరావు,చలపతిరావు పాల్గొన్నారు.

# నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ తల్లాడ :** బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగ రాష్ట్ర నాయకులు షేక్. హుస్సేన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య చేతుల మీదుగా సోమవారం తల్లాడ రింగ్ రోడ్డు సెంటర్ నందు ఆవిష్కరించటం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, దుగ్గిదేవర వెంకట్‌లాల్, మాజీ ఎంపిపి దొడ్డ శ్రీనివాసరావు, నాయకులు దిరిశాల దాసురావు, బద్దం కోటిరెడ్డి, కోదూరి వీరకృష్ణ, మోదుగు ఆశీర్వాదం, జివిఆర్, పోతురాజు వెంకటయ్య, ఇనుపనూరి వినయ్‌కుమార్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం సభ్యత్వ నమోదు



ప్రజాపక్షం/పెనుబల్లి: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం పెనుబల్లి మండలంలో ఒకరోజు సభ్యత్వాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐద్వా మండల కార్యదర్శి మిట్టపల్లి నాగమణి మాట్లాడుతూ లంకపల్లి, కొత్త లంక పల్లి, మండాలపాడు గ్రామంలో ఒక్క రోజు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా 400 మందిని చేర్పించారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపైన ఆందోళన నిర్వహించుటకు ప్రజావేదికను ఏర్పాటు చేయడానికి, సభ్యత్వ నమోదు అనేది అవసరమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు మాదాసు నాగేశ్వరి, పద్మప్రియ, రజిని, రమణమ్మ, సరస్వతి, కృష్ణవేణి, చింతల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## రైతు ధర్నాకు విశేష స్పందన

### -భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు



ప్రజాపక్షం/పెనుబల్లి: రాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు ఎన్నికల వాగ్దానాలలో భాగంగా కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలం అయిన సందర్భంగా సోమవారం పెనుబల్లి మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు కనగాల వెంకటరావు ఆధ్వర్యంలో చేపట్టిన రైతు ధర్నా కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ రైతు భరోసా రూ. 15 వేలు, రూ. 2 లక్షల ఋణమాఫీ విషయాలలో విఫలం అయిందని, రైతు భరోసా నేటి వరకు రైతుల ఖాతాలో జమ చేయలేదని, అలాగే అర్హులైన రైతులకు రూ. 2 లక్షల ఋణమాఫీ చేయలేదని పేర్కొంటూ రైతులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ధర్నా కార్యక్రమం చేపట్టారు. అనంతరం స్థానిక వివో. బంజర్ రింగ్ సెంటర్ నుంచి కాంగ్రెస్ పార్టీ మోస పూరిత వాగ్దానాలను ఎండగడుతూ స్థానిక తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు కనగాల వెంకట్రావు, నాయకులు చెక్కిలాల లక్ష్మణరావు, కోటగిరి సుధాకర్ బాబు, లక్కినేని వినీల్ బాబు, మందడపు అశోక్ కుమార్, తాళ్ళూరి శేఖర్‌రావు, టివి. రామారావు, బాబు, కనగాల సురేష్ బాబు, కాకా సీతారాములు, వంగ సురేష్, దొడ్డపనేని రవి, కొప్పుల గోవిందరావు, చలపతిరావు, చింతనిప్పు శ్రీనివాసరావు, పసుమర్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల స్థలాలు సాధించేవరకు సిపిఐ ఆధ్వర్యంలో ఐక్యంగా పోరాడుదాం



ప్రజాపక్షం/సత్తుపల్లి: వేంసూరులో గత నాలుగు రోజులుగా జరుగుతున్న భూ పోరాటంలో ఇండ్లస్థలాలు సాధించే వరకు సిపిఐ ఆధ్వర్యంలో ఐక్యంగా పోరాడుదామని పిలుపునిచ్చారు. మహిళా సమైక్య సత్తుపల్లి డివిజన్ కన్వీనర్ ఎస్ కే.రంజాన్ బి. సోమవారం జరిగిన నాల్గవ రోజు పోరాటంలో అనేకమంది పేదలు పాల్గొంటున్నారని, అనేకమందికి ఇళ్ల స్థలాలు లేక ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్నారని,అయినా గత ప్రభుత్వం పేదలను విస్మరించడం వలనే సిపిఐ ఆధ్వర్యంలో గుడిసెలు వేయవలసి వచ్చిందన్నారు. పేదలు ఐక్యంగా ఉండి ఇళ్ల స్థలాలు సాధించే వరకు ఐక్యంగా పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు యాగసిరి వెంకటేశ్వరరావు, తుమ్మల శీను, ఏఐటియుసి మండల నాయకులు షేక్ లాల్ మహమ్మద్, సోషల్ మీడియా కన్వీనర్ అజయ్, ఏఐవైఎఫ్ నాయకులు హమీద్, గుడిసె వాసులు రమేష్, సుబ్బారావు, బాలకృష్ణ, లక్ష్మి, చమలమ్మ, వెంకటేశ్వరావు, రాంబాబు, ప్రసాద్, రాజు, వెంకన్న పాల్గొన్నారు.

## సత్తుపల్లి జోనల్ స్థాయి చదరంగ పోటీల్లో మిరాకిల్ మైండ్స్ విద్యార్థుల ప్రతిభ



ప్రజాపక్షం/సత్తుపల్లి: స్థానిక సత్తుపల్లి జోనల్ స్థాయి చదరంగ పోటీలు సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ఈ చదరంగ పోటీలలో సత్తుపల్లి జోనల్ స్థాయిలో వివిధ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు 360 మంది పాల్గొనగా అందులో భాగంగా మిరాకిల్ మైండ్స్ పాఠశాలలో విద్యార్థులు వివిధ విభాగాలలో అండర్ 13 విభాగంలో మొదటి బహుమతి (జదిత్య, 7వ తరగతి), అండర్ 11 విభాగంలో మూడవ బహుమతి (జాన్సన్, 5వ తరగతి), అండర్ 8వ విభాగంలో మూడవ బహుమతి (ప్రణయ రామ్, థర్డ్ క్లాస్) విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులను మరియు అధ్యాపక బృందాన్ని మిరాకిల్ మైండ్స్ పాఠశాల చైర్మన్ దేన్ని ఇజ్రాయిల్, డైరెక్టర్ అండ్ ప్రిన్సిపాల్ రత్నాకర్ అభినందించారు.

# మాయదారి పురుగు మందులు..!

**-విచ్చలవిడిగా గుంటూరు, వేస్టేజ్ మందులు విక్రయం**
**-రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుంటున్న వైనం**
**-కొనుగోలు రశీదులు ఇవ్వని వ్యాపారులు**
**-కనిపించని బోర్డులు ధరలు పట్టిక**
**-తూతూమంత్రంగా తనిఖీలు**



ప్రజాపక్షం/ముదిగొండ : మాయదారి పురుగు మందులు ముదిగొండ మండలం లో ఉన్న రైతులను నట్టేట ముంచుతున్నాయి. పురుగు మందులకు సంబంధించిన బిల్లులు ఇవ్వకుండానే రైతులకు నాసిరకమైన మందులు అమ్ముతున్నారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కాలం చెల్లిన పురుగు మందులు, ఎరువులు యథేచ్ఛగా అమ్మకాలు పరిపాటిగా మారింది. ఎక్కువ శాతం చవక రకానికి చెందిన గుంటూరు మందులు, వేస్టేజ్ మందులను రైతులకు అంటగడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరి కొన్ని షాపుల్లో రైతులకు ఖాతాలు పెట్టి పురుగు మందులు ఇష్టారాజ్యంగా అధిక ధరలకు విక్రయిస్తున్నా పట్టించుకునే నాథుడే లేదని అంటున్నారు. దీంతో పురుగు మందులు వ్యాపారులు ఆడిందే ఆటగా.. పాడిందే పాటగా కొనసాగుతోంది. ప్రభుత్వం నిబంధనలు ప్రకారం పురుగు మందులు విక్రయించిన రైతులు సంతకాలతో కూడిన రశీదులను పెస్టిసైడ్ వ్యాపారులు రైతులకు ఇవ్వాల్సి ఉండగా అటువంటి నిబంధనలు పాటించిన దాఖలాలు లేవని ఆరోపణలు వస్తున్నాయి. దీంతో పాటు దిగుమతి అయిన వివిధ రకాల పురుగు మందులు, ఎరువులు స్టాక్ పరిస్థితిని, ధర వివరాలను ఎప్పటికప్పుడు రిజిష్టర్ లో నమోదు చేయాల్సి ఉంటుంది. కాగా మండలం లో 32 పెస్టిసైడ్ దుకాణాలు అధికారికంగా నడుస్తున్నాయి. వీటిలోనే రైతులు అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని వ్యాపారులు కాలం చెల్లిన పురుగు మందులు, గుంటూరు, వేస్టేజ్ మందులు విక్రయిస్తున్నారు. అదేవిధంగా స్టాక్ నిల్వ ఉంచే గోదాములకు అనుమతులు తీసుకుని ఎన్ని రకాల పురుగు మందులు, ఎరువులు, విత్తనాలు ఉంచామనే విషయం అధికారులు చెప్పాలి. కానీ ఇక్కడ ఇటువంటి నిబంధనలు ఏవి అమలు కాక పోవడం విశేషం. రైతుల అమాయకత్వాన్ని, అవసరాలను ఆసరాగా చేసుకుని వ్యాపారులు జీరో దందా కొనసాగిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా వేస్టేజ్ మందులతో పాటు గుంటూరు మందులైన మూవ్, ఫిన్నిష్, లాపర్, డింపర్, కొంకన్ వంటి పురుగు మందులు ఉపయోగించడం వల్ల సరైన దిగుబడులు రాక తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా సదరు నాసిరకం గుంటూరు, వేస్టేజ్ మందులు గోకినపల్లి, ముదిగొండ, యడవల్లి, మాదాపురం, కమలాపురం, వల్లబి, బాణాపురం గ్రామాల్లో విక్రయిస్తున్నట్లు సమాచారం. వాస్తవానికి పెస్టిసైడ్ దుకాణాలను నెలకు నాలుగు సార్లు మండల వ్యవసాయ అధికారులు, నెలకు రెండు సార్లు ఏడిఏ, ఒకసారి జేడిఏ అధికారులు పురుగు మందులు షాపులను తనిఖీలు చేయాల్సి ఉండగా అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. సీజనల్ వారిగా పురుగు మందుల వ్యాపారులు ఇచ్చే చేతి వాటం కు అలవాటు పడి అప్పుడప్పుడు తనిఖీలు నిర్వహించి పత్రికలకు ప్రకటనలు విడుదల చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి కాలం చెల్లిన పురుగు మందులతో పాటు గుంటూరు, వేస్టేజ్ వంటి పురుగు మందులు విక్రయిస్తున్న దుకాణాలపై దాడులు నిర్వహించి అధిక ధరలను నిరోధించాలని మండలంలోని రైతులు కోరుతున్నారు. ఈ విషయం పై మండల వ్యవసాయ అధికారి వేణు ను ప్రజాపక్షం విలేకరి అడుగగా రోజుకు ఐదు పురుగు మందుల షాపులను తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. క్షేత్రస్థాయిలో నిత్యం తనిఖీలు చేపడుతున్నామని, ఎలాంటి అనుమతులు లేని పురుగు మందులు విక్రయిస్తే షాపులకు లైసెన్స్ రద్దు చేయడమే కాకుండా చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# ఆరోగ్యమే కాదు.. అక్షరాలు నేర్పుతారు...







ప్రజాపక్షం/సత్తుపల్లి: ఆరోగ్యమే కాదు అక్షరాలు నేర్పించటంలో తాను ముందుంటానంటున్నారు సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి దయానంద్ విజయ్ కుమార్. ప్రజా సంక్షేమంతో పాటు వైద్యరంగంలో రాణిస్తూ, విద్యా రంగాన్ని కూడా ఓ చూపు చూస్తూ అన్నింట్లో తాను ముందుంటానని నిరుపిస్తూ ముందుకు సాగుతున్నారు ఎం.ఎల్.ఏ డా.మట్టా రాగమయి. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆమె ఒక గురువులా చిన్నారులకు చదువు నేర్పుతు చిన్నారులను అలరించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ క్లాసులను ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు ఎం.ఎల్.ఏ. అనంతరం చిన్నారులతో కలిసి ఆడి పాడుతూ బడి అంటే భయం కాదని, బడి అంటే బంధుత్వమని, బడి అంటే బంగారు భవిష్యత్ అనేలా చిన్నారులకు వివరిస్తూ పాఠాలు బోధించారు. అనంతరం అంగన్‌వాడీ స్కూల్ ను పరిశీలించి, చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. మంచి ఆహారం అందిస్తూ పాఠాలు చెప్పాలని అంగన్ వాడీ టీచర్ కు సూచించారు. అనంతరం స్కూల్ ఆవరణలో చిన్నారుల కోసం తయారు చేస్తున్న మధ్యాహ భోజనం ను పరిశీలించారు. ఈ కార్యక్రమం లో సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ తోట సుజాల రాణి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాదే చెన్నకేశవరావు, కమల్ పాషా, చల్లగుళ్ళ నర్సింహరావు, మండల విద్యాశాఖాధికారి నక్కా రాజేశ్వరరావు, సిడిపిఓ కనకదుర్గ, సారధి రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, అంగన్ వాడీ సూపర్ వైజర్, పాఠశాల చిన్నారులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మత ఉన్మాదం దేశానికి ప్రమాదకరం




ప్రజాపక్షం/ముదిగొండ : హైందవ శంఖారావం, సనాతన ధర్మం పేరుతో మనువాద ఆర్ఎస్ఎస్, బీజేపీ లు దేశంలో మత ఉన్మాదం ను రెచ్చగొడుతున్నారని ఇది దేశానికి పెను ప్రమాదకరం అని సిపిఎం రాష్ట్ర నాయకులు పొన్నం వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం స్థానిక మచ్చా వీరయ్య భవనంలో ఆ పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు టీఎస్ కళ్యాణ్ అధ్యక్షతన జరిగిన మండల జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత దేశం కరెన్సీ రూపాయి పతనం దేశ ఆర్థిక వ్యవస్థను అంథ పాతాళానికి తీసుకపోతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేరళ లో సిపిఎం ప్రభుత్వం హయాంలో విద్య, వైద్య రంగాలు అభివృద్ధి లో దూసుకుపోతున్న ఓర్వలేక బీజేపీ కేంద్ర మంత్రులు మిని పాకిస్థాన్ అంటూ విష ప్రచారం చేస్తున్నారని ఆయన అన్నారు. అదే విధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడం చేతకాక కొత్త సమస్యలు సృష్టించి ప్రజలను గందరగోళం కు గురి చేస్తోంది అని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు బండి పద్మ, వాసిరెడ్డి వరప్రసాద్, డివిజన్ నాయకులు మడుపల్లి గోపాల్ రావు, మండల నాయకులు టీ ఎస్ కళ్యాణ్, వేల్పుల భద్రయ్య, మందరపు వెంకన్న, కొండమీద రఘు పతి, మంకెన దామోదర్, రాయల శ్రీనివాసరావు, ఇరుకు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# నూతన సొసైటీలకు ప్రతిపాదనలు

**-కొత్తగా నాలుగు సొసైటీలు**



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : రైతుల సౌలభ్యం కోసం ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను బలోపేతం చేయడంతో పాటు నూతన సంఘాల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రస్తుతం ఉన్న సొసైటీల పరిధిలో ఉన్న గ్రామాలకు, సొసైటీకి దూరం ఎక్కువగా ఉండడంతో వాటిని తగ్గించేందుకు ప్రభుత్వం దృష్టిసారించింది. రైతులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు వ్యాపారాభివృద్ధికి తోడ్పాటునందించేలా ప్రస్తుతం ఉన్న సొసైటీలకు అనుగుణంగా వాటి పరిధిలోని గ్రామాలను అనుసంధానం చేస్తూ నూతన సొసైటీలకు శ్రీకారం చుట్టింది. రఘునాథపాలెం మండలంలో ప్రస్తుతం వి.వెంకటాయపాలెం, మంచుకొండ, రఘునాథపాలెం సొసైటీలు ఉండగా మరో నాలుగు సొసైటీలు ఏర్పాటు కానున్నాయి. చింతగుర్తి, చిమ్మపుడి, ఈర్లపుడి, అల్లిపురం కేంద్రంగా నూతన సొసైటీలు ఏర్పాటు కానున్నాయి. దీనికి సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ప్రస్తుతం వి. వెంకటాయపాలెం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం పరిధిలో ప్రస్తుతం 18 గ్రామాలున్నాయి. ఈ సొసైటీ పరిధిలో చింతగుర్తి, అల్లిపురం కేంద్రంగా నూతన సొసైటీలకు ప్రతిపాదనలు పంపించారు. ప్రస్తుతం వివిపాలెం సొసైటీ పరిధిలో వి.వెంకటాయపాలెంతో పాటు వేపకుంట్ల, చెరువుకొమ్ముతండ, ఖమ్మం నగరాన్ని అనుసంధానించారు. కొత్తగా ఏర్పాటు చేయనున్న చింతగుర్తి సొసైటీ పరిధిలో చింతగుర్తి, గణేశ్వరం, మల్లేపల్లి, పరికలబోడుతండా, జింకలతండా, గడ్డికుంటతండా, బావోజితండా, రాములుతండా గ్రామాలను చేర్చారు. ఖమ్మం నగరంలోని అల్లిపురం కేంద్రంగా ఏర్పాటు చేసే సొసైటీ పరిధిలోకి అల్లిపురం, కొత్తగూడెం, ధంసలాపురం ప్రాంతాలను చేర్చారు. గతంలో వేపకుంట్ల, అల్లిపురం సొసైటీలు ఉండగా వాటిని 2005లో వివిపాలెం సొసైటీలోకి అనుసంధానం చేశారు. మరల ఇప్పుడు అల్లిపురంతో పాటు చింతగుర్తి కేంద్రంగా నూతన సొసైటీల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించారు. మంచుకొండ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం పరిధిలో ప్రస్తుతం 30గ్రామలు ఉన్నాయి. ఈ సొసైటీ పరిధిలో మరో రెండు సొసైటీలు చిమ్మపుడి, ఈర్లపుడి కేంద్రంగా సొసైటీల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించారు. ప్రస్తుతం ఉన్న మంచుకొండ సొసైటీ పరిధిలోకి మంచుకొండ, బూడిదంపాడు, శివాయిగూడెం, హర్యాతండా, సుకినితండా, జత్యాతండాలను, నూతనంగా ఏర్పాటు చేసే చిమ్మపుడి సొసైటీ పరిధిలోకి కోయచలక, రేగులచలక, కోటపాడు, చిమ్మపుడి, పాపటపల్లి, జికెబంజర, విఆర్‌బంజర గ్రామాలతో నూతన సొసైటీకి ప్రతిపాదనలు పంపించారు. ఈర్లపుడి కేంద్రంగా ఏర్పాటు చేసే సొసైటీ పరిధిలోకి ఈర్లపుడి, రాంక్యాతండా, బజ్యాతండా, కొర్లబోడుతండా, పుటానితండా, సూర్యాతండా, పంగిడి, కెవి బంజర, రజబ్ అలీ నగర్, ఎన్‌వి బంజర, లచ్చిరాంతండా, దొనబండ, మంగ్యాతండా, మూలగూడెం తదితర గ్రామాలతో నూతన సొసైటీ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించారు. నూతన సొసైటీలు ఏర్పాటైతే రైతులకు ఎంతో ప్రయోజనం ఉంటుంది. సొసైటీలకు వెళ్లేందుకు ఆయా గ్రామాల రైతులకు దూరం తగ్గడంతో పాటు సత్వర సేవలు అందే అవకాశం ఉంటుంది. గతంలో కోయచలక, పాపటపల్లి కేంద్రాలుగా సొసైటీలు ఉండగా వాటిని 2005లో మంచుకొండ సొసైటీలో అనుసంధానం చేశారు. మరల ఇప్పుడు చిమ్మపుడి, ఈర్లపుడి కేంద్రంగా నూతన సొసైటీలను ఏర్పాటు చేయనున్నారు.

# గుండెపోటు రాకుండా కొన్ని చిట్కాలు పాటించండి



ప్రజా పక్షం/మణుగూరు రూరల్: ప్రస్తుతం ఈ రోజుల్లో చాలా మంది హార్ట్ స్ట్రోక్ అంటే గుండెపోటు వల్ల మరణిస్తున్నారు. గుండెపోటు కారణంగా చాలామంది అక్కడికక్కడే క్షణాల్లో ప్రాణాలు పోయేవి. అయితే ఆరోగ్య నిపుణులు చెప్పిన విధంగా మనం కొన్ని సూత్రాలను కచ్చితంగా పాటిస్తే మన ఆరోగ్యం చాలా బాగుంటుంది. కాబట్టి ఈ గుండెపోటుకు కూడా హార్ట్ స్పెషలిస్ట్ కొన్ని ఆరోగ్య సూత్రాలను తెలియజేశారు. ఇవి కనుక మనం కచ్చితంగా విన్నట్లయితే మనం గుండెపోటు భారీ నుండి తప్పించుకోవచ్చు. ఉదయం నిద్ర లేచిన వెంటనే కచ్చితంగా రెండు గ్లాసుల గోరువెచ్చని నీళ్లు తాగితే మన శరీరంలోని అవయవాలు అన్ని కూడా చాలా యాక్టివ్ గా పని చేస్తూ నిరసం అనేది తగ్గిస్తూ ఉంటాయి. అలాగే మనం భోజనం చేసే అరగంట ముందు కచ్చితంగా ఒక గ్లాస్ నీరు తాగాలి. అప్పుడే ఆహారం అనేది బాగా జీర్ణం అవుతుంది. కాబట్టి భోజనం చేయడానికి అరగంట ముందు ఒక గ్లాసు నీళ్లు తాగి ఇక భోజనం అయిన గంట తర్వాత నీళ్లు తాగడం చాలా మంచిది. వీటితోపాటుగా మనం స్నానం చేసే ముందు ఒక గ్లాసు నీళ్లు తాగితే కచ్చితంగా గుండెపోటు వచ్చేటువంటి అవకాశం అయితే చాలా వరకు తగ్గుతుందని డాక్టర్లు చెబుతున్నారు. చాలామంది ప్రస్తుత రోజుల్లో అర్ధరాత్రి నిద్ర లేచి నీళ్లు తాగుతూ ఉంటారు. ఇలా చేయడం వల్ల కాళ్లు తిమ్మిరి ఎక్కకుండా ఉంటాయి. కాబట్టి అర్ధరాత్రి నీళ్లు తాగడంలో ఎటువంటి ప్రాబ్లం లేదు. ఈ భూమి మీద ఉన్న ప్రతి ఒక్క మానవుడు ప్రతిరోజు కూడా మన శరీరానికి కావాల్సినంత నీళ్లు తాగితే ఎటువంటి అనారోగ్యం కూడా ఉండదని ఆరోగ్య నిపుణులు హెచ్చరించారు. కాబట్టి కచ్చితంగా ప్రతిరోజు కూడా ఎనిమిది గ్లాసులు వరకు నీళ్లు తాగడం చాలా మంచిదని డాక్టర్లు చెబుతున్నారు. మన శరీరానికి సరిపడా నీళ్లు త్రాగడం వల్ల అనారోగ్య సమస్యలకు చాలా దూరంగా ఉండొచ్చట. వివిధ రకాల సమస్యలు బారిన ప్రతిరోజు కూడా చాలామంది ఆసుపత్రుల పాలవుతున్నారు. కాబట్టి ప్రతిరోజు కూడా శరీరానికి కావలసినంత నీరు తీసుకుంటే ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తువని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. కాబట్టి ఎక్కువ నీళ్లు తాగడం గుండెపోటును నివారించవచ్చు అని గుండెపోటు స్పెషలిస్ట్ డాక్టర్లు చెబుతున్నారు. కాబట్టి ప్రతిరోజు కూడా వీలైనంత వరకు ఎనిమిది గ్లాసుల వరకు నీళ్లు తాగండి.

## ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు



ప్రజాపక్షం/జూలూరుపాడు: వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ను ఆర్యవైశ్య ప్రముఖులు ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెండ్యాల విజయభాస్కర్, జిల్లా ఆర్యవైశ్య పొలిటికల్ కమిటీ చైర్మన్ కొదుమూరి కోటేశ్వరరావు లు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శాలువాలతో సత్కరించి బాలాజీ క్యాలెండర్‌ను అందజేశారు. ఆయురారోగ్యాలతో తులతూగాలని ప్రజలకు మరిన్ని సేవలు అందించి అర్హులైన పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషిచేసి పేరు ప్రతిష్టతలు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.

## ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును పరిష్కరిస్తాం : తహసీల్దార్



ప్రజాపక్షం/తిరుమలాయపాలెం : మండల స్థాయిలోనే ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించేందుకు ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆయా మండల కేంద్రాల్లో ప్రజావాణి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో తహసిల్దార్ పివి.రామకృష్ణ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలు పలు సమస్యలతో దరఖాస్తులు సమర్పించారు. మండల వ్యాప్తంగా పలు శాఖల నుండి మొత్తం 09 దరఖాస్తులు రాగా వీటిలో రెవెన్యూ 06, పంచాయతీరాజ్ 01, వ్యవసాయ శాఖ కు 01 రాగా ఎక్సైజ్ శాఖ కు 01 ఫిర్యాదు అందింది మండలంలో మొత్తం ఐదు వైన్ షాపులు,బెల్ట్ షాపులు వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అట్టి మద్యం దుకాణాలను జనసంద్రహాలకు దూరంగా ఏర్పాటు చేయాలని దరఖాస్తులో బహుజన సమాజ్ పార్టీ కి చెందిన నాయకులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రజల నుండి వినతులను స్వీకరించిన అనంతరం తహసిల్దార్ పివి.రామకృష్ణ, ఎంపీడీవో సిలార్ సాహెబ్, మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సిలార్ సాహెబ్, ఎంపీఓ సూర్యనారాయణ, రెవిన్యూ ఇన్స్పెక్టర్లు వీరయ్య, పశు వైద్యులు అనూష, మండల వ్యవసాయ అధికారి, సీతారాం రెడ్డి, ఏటీఎం అలివేలు మంగ, పంచాయతీ కార్యదర్శి సుజాత వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కనీస వేతనాల సలహా మండలి సభ్యునిగా ప్రమాణం స్వీకారం చేసిన యారం



ప్రజాపక్షం/బూర్గంపాడు: తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి సభ్యుడిగా సారపాక ఐటిసి పేపర్ పరిశ్రమలోని ఐఎన్‌టి యూసి జనరల్ సెక్రటరీ యారం పిచ్చిరెడ్డి నియమితులైన విషయం విధితమే. సోమవారం హైదరాబాద్‌లో ఛైర్మన్ జనక్ ప్రసాద్ సమక్షంలో బోర్డ్ సభ్యునిగా యారం పిచ్చిరెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఈసందర్భంగా యారం పిచ్చిరెడ్డి మాట్లాడుతూ కార్మిక సంఘాల ప్రతినిధిగా నాపై నమ్మకంతో నాకు ఈ పదవి అందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి, ఛైర్మన్ జనగ ప్రసాద్‌కి, పినపాక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు, ఐఎన్‌టియూసి రాష్ట్ర ఉపాధ్యక్షులు మారం వెంకటేశ్వరరెడ్డికి ముందుగా ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఈ పదవి దక్కటం నాకెంతో గర్వకారణంగా ఉందన్నారు. నాకు వచ్చిన అవకాశాన్ని కార్మికుల పక్షాన నిలబడి హక్కులు సాధించే విధంగా పోరాడుతానన్నారు. త్వరలో జరగబోతున్న ఐటిసి ఎన్నికలలో ఐఎన్‌టియూసి విజయ ఢంకా మోగించడం తన ముందున్న లక్ష్యమని అన్నారు. అనంతరం ఛైర్మన్ జనక ప్రసాద్‌ని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛంతో అభినందించారు.

## అనుమతులు త్వరితగతిన మంజూరు చేయాలి



ప్రజాపక్షం/బూర్గంపాడు: నాగినేనిప్రోలురెడ్డి పాలెంలో ఉన్నటువంటి ఊర చెరువును 30లక్షల రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేయాలని, మినీ ట్యాంక్ బండ్‌గా రూపొందించాలనే సంకల్పించిన తాజా మాజీ గవర్నర్ డా బూసిరెడ్డి శంకర్‌రెడ్డి, ఈ చెరువును అభివృద్ధి పరచడానికి రోటరీ క్లబ్ ఆఫ్ గ్లోబర్ విజార్డ్స్ హైదరాబాద్, ఐటిసి ఇన్ భద్ర సారపాక రోటరీ క్లబ్‌లకు గవర్నర్‌గా అనుమతులు మంజూరు చేశారు. అందులో భాగంగానే జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేయడం, జిల్లా కలెక్టర్ రోటరీ క్లబ్ వారికి కావాలసిన అనుమతులు గ్రామ పంచాయితీ నుండి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ మంజూరి తదితర ప్రభుత్వ అనుమతులను ప్రతిఘటన పూర్తి చేసి ఇవ్వాల్సిందిగా స్థానిక తహసీల్దార్‌కి ఆదేశాలు ఇచ్చారు. అందులో భాగంగా సోమవారం రోటరీ ఇంటర్నేషనల్ 3150 జిల్లా తాజా మాజీ గవర్నర్ రో డాక్టర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి, రోటరీ క్లబ్ ఆఫ్ గ్లోబస్ విసార్ట్స్ అధ్యక్షులు రొటేరియన్ నంబూరి వెంకటరాజు, ప్రాజెక్ట్ కాంటాక్ట్ రోటేరియన్ సురేన్ పోరూరిలు బూర్గంపాడు తహసీల్దార్ ముజాహిద్‌ను కలిసి అనుమతులు త్వరితగతిన మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ అనుమతులు రాగానే చెరువు అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, మార్చి లోపల పనులు పూర్తి చేయ సంకల్పించామని రోటరీ బృందం తహసీల్దార్‌కి తెలిపారు.

## డిమాండ్స్ డేని విజయవంతం చేయండి



ప్రజాపక్షం/కారేపల్లి: డిమాండ్స్ డే నీ విజయవంతం చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం ఖమ్మం డివిజన్ అధ్యక్షులు గుగులోతు తేజనాయక్ అన్నారు. సోమవారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మద్దతు ధరపై రైతుల హక్కుల సాధనకై ఆయన మాట్లాడుతూ రైతులను మోసగిస్తూ వస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం వైఖరిని మార్చుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. ఎన్నికల ముందు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఎంఆర్‌పినీ చట్టబద్ధత చేయాలని, 200 రోజుల పని దినాలు కార్మికులకు కల్పించాలని, 2006ను అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయాలని, చిన్న సన్నకారు రైతులకు రుణమాఫీ చేయాలని, సామాజిక న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్స్ డే సందర్భంగా అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమాన్ని రైతులు మేధావులు ప్రజలు అందరు విజయవంతం చేయాలని తెలిపారు.

## పిఆర్‌టియుసి క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ




ప్రజాపక్షం/ములకలపల్లి: ములకలపల్లి మండలం విద్యాశాఖ అధికారి జీ సత్యనారాయణ చేతుల మీదుగా పిఆర్‌టియు టిఎస్ క్యాలెండర్, డైరీ 2025ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ములకలపల్లి మండల పిఆర్‌టియు అధ్యక్షులు పూర్ణ మాట్లాడుతూ ఉద్యోగులకు ఇవ్వాల్సిన, ఎన్నికలలో ఇచ్చిన హామీలు పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలని, మిగిలిన డిఏలను తక్షణం ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. గత నెల రోజుల నుండి సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్ట్ ఉద్యోగులు, కేజీబీవీ ఉపాధ్యాయులు ధర్నా కార్యక్రమం చేపట్టారు. వారికి పిఆర్‌టియు టిఎస్ యూనియన్ సంపూర్ణ మద్దతుని రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయిలో మండల స్థాయిలో కూడా అందిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో పిఆర్‌టియు ములకలపల్లి మండల ప్రధాన కార్యదర్శి జి సీతారాం, రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షులు వి శ్రీదేవి, రాష్ట్ర కార్యదర్శులు బి నారాయణ, వి దస్రు, డి శంకర్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రామస్వామి, మండల మహిళా ఉపాధ్యక్షులు స్వరూప, భవాని, కార్యదర్శులు జయసుధ, సుజాత, రవీందర్, బుల్లెయ్య, వీరన్న, బాలు, ఆనందరావు, మధు, అఖిల్ పాల్గొన్నారు.

# సామాజిక సేవ ఓ వరం : కలెక్టర్

## పిఎస్ఆర్ ట్రస్టు క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ఖమ్మం :** సామాజిక సేవ ఓ వరం లాంటిదని సామాజిక చైతన్యానికి, అభివృద్ధికి కృషి చేయడం ముఖ్యంగా విద్యాభివృద్ధికి చేయూతనివ్వడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు రూపొందించిన 2025 సంవత్సర క్యాలెండర్‌ను స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ సీతా రత్నం చారిటబుల్ ట్రస్టు పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తూ చేయూతనివ్వడం అభినందనీయమన్నారు. ట్రస్టు సేవలు మరింత విస్తృత పర్చాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్య క్రమంలో అదనపు కలెక్టర్ శ్రీజ, ట్రైనీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు పరిశ పుల్లయ్య, కనపర్తి వెంకటేశ్వర్లు, నంబూరి శంకర్‌రావు, మీడియా ప్రతినిధులు ఏనుగు వెంకటేశ్వరరావు, నలజాల వెంకట్రావు, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపక్షం సేవలు భేష్ : మాజీ విప్ రేగా

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజాపక్షం ప్రతి అక్షరం ప్రజల కోసమే అని బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ రాష్ట్ర ప్రభుత్వ విప్, మాజీ పినపాక శాసన సభ్యులు రేగా కాంతా రావు అన్నారు. సోమవారం మణుగూరులో గల బిఆర్ఎస్ పార్టీ కార్యా లయం నందు ప్రజాపక్షం దినపత్రిక 2025 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ప్రజాపక్షం పినపాక నియోజకవర్గ ఆర్‌సి ఇన్‌చార్జ్ వి నాగేశ్వరరావు అధ్వర్యంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా ప్రజాపక్షం దిన పత్రిక ముందుకు సాగుతుందని అన్నారు. సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి, అధికారులకు చేరే విధంగా పత్రిక రంగంలో ప్రజాపక్షం స్థానం సుస్థిరస్థానమని పేర్కొన్నారు. ప్రజాపక్షం దినపత్రికలో పని చేస్తున్న పాత్రికేయులు ప్రతి నిత్యం ప్రజల పక్షాన పని చేసి అన్ని వర్గాల ప్రజలు, అధికారులకు మధ్య సమన్వయంతో వ్యవహరిస్తూ సమస్యల




పరిష్కారానికి తమ వంతు పాత్ర పోషించాలని తెలిపారు. ఈకార్యక్ర మంలో సొసైటీ ఛైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, బిఆర్ఎస్ నాయకులు అప్పారావు, కుంటా లక్ష్మ ణ్, మీసాల నర్సింహారావు, ఆవుల నర్సింహా రావు, ఎన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

## - నూతన గ్రామపంచాయతీ భవనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే జారే



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** తెలంగాణలోని గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారా యణ అన్నారు. సోమవారం మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మండలంలోని మద్దికొండ, నారంవారిగూడెంకా లనీ, అల్లిగూడెం, అశ్వారావుపేట గ్రామపంచాయతీల్లో రూ.40లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాలను ఆయన ప్రారంభించారు. అల్లిగూడెం గ్రామపంచాయతీ నిర్మాణానికి స్థలాన్ని దానం చేసిన మొడియం నర్సింహులు కుటుంబాన్ని ప్రత్యేకంగా అభి నందించారు. మద్దికొండ, కొత్తనారంవారిగూడెం గ్రామాల్లో ప్రభుత్వం మంజూరు చేసిన సిసి రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అదేవి ధంగా మొద్దులగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నూతన ప్రవహ రీగోడ నిర్మాణానికి శంకుస్థాపన చేసి పాఠశాల విద్యార్థులకు లైబ్రరీ బుక్స్ అందించారు. పాతనారంవారిగూడెం గ్రామంలో శిథిలావస్థలో ఉన్న అంగన్వాడీ భవనం పరిశీలించి త్వరలో నూతన భవనం నిర్మిస్తా మని హామీ ఇచ్చారు. అనంతరం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి వసతులు పరిశీలించారు. ఎమ్మెల్యే పర్యటనలో భాగంగా ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా నని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ కృష్ణప్రసాద్, ఎంపి డిఓ ప్రవీణ్‌కుమార్, సిఐ కరుణాకర్, ఆర్‌డబ్ల్యుస్ ఎఇఇ సతీష్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తుమ్మా రాంబాబు, జూరల్లి రమేష్, జేష్ట సత్యనారాయణచౌదరి, మొగళ్ళపు చెన్నకేశవరావు, జూపల్లి ప్రమోద్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి ఏరియా హాస్పిటల్‌లో పిల్లల డాక్టర్, గైనకాలజిస్ట్‌ను నియమించాలి

**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు ఏరియా హాస్పిటల్ నందు గైన కాలజిస్ట్ మరియు పిల్లల డాక్టర్‌ను వెంటనే నియమించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి వల్లూరి వెంకట రత్నం సోమవారం డిమాండ్ చేశారు. పి.వీ కాలనీ సిఐటియు ఆఫీ సులో టీవీ ఎం వి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బ్రాంచ్ కార్యదర్శి మాట్లాడుతూ మణుగూరు ఏరియాలో యువతరం ఎక్కువ మంది ఉన్నారని, యువతరంతోనే ఉత్పత్తి మరియు ఉత్పాదికతలో మణుగూరు ఏరియా ముందంజలో ఉందని దీనికి అనుగుణంగా మణు గూరు ఏరియా హాస్పిటల్ నందు గైనకాలజిస్ట్ మరియు పిల్లల డాక్టర్‌ను వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో గుర్తింపు మరియు ప్రాతినిధ్య సంఘాలు చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో లక్ష్మి రావు, రామ్మూర్తి, ఈశ్వరరావు, విల్సన్ రాజు, లక్ష్మ ణరావు, ప్రభాకర్ రావు, బుచ్చిరెడ్డి, బిక్షపతి, సాయి, కృష్ణ సుమన్, శ్రీకాంత్, శ్రీను, రాజకుమార్, విజయకుమార్ పాల్గొన్నారు.

# లక్ష డప్పులు, వేల గొంతుల ర్యాలీని జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఫిబ్రవరి 7వ తేదీన హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ వ్యవ స్థాపకులు మంద కృష్ణమాదిగ నాయక త్వంలో నిర్వహించబోయే లక్షడప్పులు, వేల గొంతుల ర్యాలీని జయప్రదం చేయా లని,ఎంఎస్‌పి జాతీయ కమిటీ నాయకులు వంగూరి ఆనందరావు మాదిగ, ఉపకులాలకు పిలుపునిచ్చారు. సోమ వారం ఖమ్మం రూరల్ మండలంలోని తల్లంపాడుగ్రామంలోని ఎస్‌సీకా లనీలో మాదిగరిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఎస్‌సీ వర్గీకరణ అమలు చేయాలని, నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. వర్గీకరణ అమలు కోరుకునే రాష్ట్రాలు



స్వచ్ఛందంగా ముందుకు వచ్చి జీవోను అమలు చేయాలన్నారు. కావాలని తాత్సరం చేస్తే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగ, ఉపకులాల ఆగ్రహానికి గురికాకత ప్పదని, హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సిరిపురపు బందయ్యమాదిగ, చింటుమాదిగ, జిల్లపల్లి గణేష్‌మాదిగ, రాములుమా దిగ, ఎర్రవెంకటేశ్వర్లుమాదిగ, కొమ్ము నర్సయ్యమాదిగ, కుక్కల అశోక్ మాదిగ, బూరుగడ్డ మోహన్‌రావుమాదిగ, కొమ్ము లక్ష్మయ్యమాదిగ, చంద్రమోహన్‌మాదిగ, చింతేటి నాగేంద్రమాదిగ, బొడ్డు రాంబాబుమా దిగ, కృష్ణమాదిగ, వెంకటేశ్వర్లుమాదిగ, వీరబాబుమాదిగ, వీరయ్యమా దిగ, కాలనీవాసులు పాల్గొన్నారు.

# ప్రజాపక్షం క్యాలెండర్ ఆవిష్కరణ




**ప్రజాపక్షం/మణుగూరు:** ప్రజాపక్షం జాతీయ దినపత్రిక 2025 క్యాలెండర్ ను సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయోధ్య సోమవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీకి చెందిన ప్రజాపక్షం దిన పత్రిక నిత్యం ప్రజా సమస్యలను వెలికితీయ టంలో ముందుండి, ప్రజల కోసం, ప్రజల వైపు నిలబడి వార్తా కథనాన్ని అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మున్నా లక్ష్మీ కుమారి, పినపాక నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి సరిరెడ్డి పుల్లారెడ్డి, రామంజవరం మాజీ సర్పంచ్ బాడీ తులు పాల్గొన్నారు.

# రైతులను అవమానపరుస్తున్న తెలంగాణ సిఎం



**ప్రజాపక్షం/కొణిజర్ల :** ఎన్నికల ముందు రైతులకు రైతుభరోసా రూ 15 వేలు ఇస్తా నని హామీనిచ్చి అధికారంలోకి వచ్చాక రూ 12 వేలు ఇస్తాననడం రైతులను అవమానప ర్చడమేనని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం ఖమ్మం జిల్లా ప్రధానకార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు కొండపర్తి గోవిందరావు, దొండపాటి రమేష్ అన్నారు. మండల పరిదిలోని తనికెళ్ల సిపిఐ కార్యాలయంలో సోమవారం రైతుసంఘం సమా వేశం నిర్వహించారు. ఈసమావేశంలో వారు మాట్టాడుతు భేషరుతుగా రైతులకు ఇచ్చిన హామీ లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రెండు లక్షల రూపాయణల రుణమాఫి కూడా అంద రికి కాలేదని, రెండు లక్షలపైనున్న రైతులను రెండు లక్షలకు పైనున్న డబ్బులు చెల్లిస్తే రుణ మాఫి అవుతుందని చెప్పడంతో చాలా మంది రైతులు డబ్బులు చెల్లించారని వారికి కూడా ఇంత వరకు రుణమాఫి కాలేదని విమర్శించారు. రైతులకు రుణమాఫి కాకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేయన్నుట్లు హెచ్చరించారు. రైతు భరోసా, రైతురుణమాఫి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలన రైతుల్లో ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి పెరిగిందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నిం టిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కూచిపూడి రవి, పివిరావు, బాసా నాగరాజు, గడల శ్రీనివాసరావు, కొలుపుల సాంబయ్య, చాట్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# సినీ హీరోల అభిమానులు సమాజ సేవ చేసి అభిమానాన్ని చాటాలి



**ప్రజాపక్షం/పాల్వంచ టౌన్:** సినీ హీరోల అభి మానులు సమాజ సేవ చేసి, తమ హీరోపై తమ కున్న అభిమానాన్ని చాటాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్, డిసిఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాస రావు అన్నారు. సోమవారం పాత పాల్వంచలోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన సూపర్ స్టార్ కృష్ణ, మహేష్ బాబు, సితార, బలగం గ్రూప్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవి ష్కరించారు. అనంతరం సూపర్ స్టార్ కృష్ణ, మహేష్ బాబు అభిమానులు కొత్వాలను శాలువా, బొకేలతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సూపర్ స్టార్ కృష్ణ, మహేష్ సేన ఉపాధ్యక్షులు రాపాక కాంతరాజు, పట్టణ అధ్యక్షులు ఎస్‌కే పాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ కాంపాటి దుర్గాప్రసాద్, జిల్లా ఆర్గనైజర్ కాంపాటి మహేష్, ట్రెజరర్ రవి, మహేష్ ఫ్యాన్స్ సిరాజ్, సాయి, రాజు, పాల్వంచ మండల అధ్యక్షులు సారయ్య, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు పైడిపల్లి మహేష్, ఉండేటి శాంతివర్ధన్, వీర కుమార్, పవన్, టిఎన్‌టియూసి పట్టణ ప్రధాన కార్యదర్శి శనగ రామచందర్, క్యాలెండర్ డిజైనర్ సాయిజీ, తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి



**ప్రజాపక్షం/కరకగూడెం:** కరకగూడెం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను స్థానిక ఎంఈఓ గడ్డం మంజుల ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. అనంతరం ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షులు మలకం కుమార్ స్వామి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీలు భారత రాజ్యాం గ ఫలాలనందుకొని అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. కష్టపడి చదువుకొని ఉన్నత లక్ష్యాలను చేరుకునేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని, అన్ని సమస్యలకు మూలం చదువుకోవడమేనని, చదువుకోవడం ద్వారానే వ్యక్తి పరిపూర్ణుడవుతాడని ఏజెన్సీ ప్రాంతంలో అందరూ చక్కగా చదువుకోవాలని ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతంలో విద్యా వ్యవస్థ పై మరింతగా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని వారన్నారు. ఈ కార్యక్రమంలో ఆది వాసి టీచర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు మైపతి తిరుమలరావు, కొమరం అశోక్ కుమార్, పోలెబోయిన రంజిత్ కుమార్, మహిళ అధ్యక్షురాలు తొలేం మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో సమస్యల పరిష్కారం

**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల ప్రజల సమస్యలను పరిష్కరిచేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహాశీల్దార్ మన్నె ఉషాశారద, ఎంపిడిఓ బి.సురేందర్ అన్నారు. ఎంపిడిఓ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి మండల పరిధిలోని పలు గ్రామాల ప్రజలు హాజరై తమ సమస్యలను తెలిపారు. ఈ సందర్భంగా తహాశీల్దార్ మాట్లాడుతూ తమ సమస్యలపై మండల ప్రజలు లిఖితపూర్వకంగా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ప్రజావాణిలో పలు సమస్యలపై దరఖాస్తు చేసుకోగా వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ జెసిబి ఓ.కృష్ణ, ఆర్ఐ రవికుమార్, విద్యుత్ ఎఈ అనూష, మిషన్ భగీరథ ఏఇ ప్రసన్న, ఎపిఎం వెంకటేశ్వర్లు, ఎంఇఓ మురళీమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనంలో తుట్టెలు, పురుగులు

ప్రజాపక్షం/కొణిజర్ల : తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులకు మధ్యాహ్న బోజనం వండడానికి సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తుంది. కాని అవి నాసిరకంగా ఉంటున్నాయని విద్యార్థుల తల్లితండ్రులంటున్నారు. పెద్ద గోపతి లోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, ప్రాథమిక పాఠశాలలోపాటు మండలంలోని మిగతా ప్రభుత్వ పాఠశాలలకు కూడా తుట్టెలు, పురుగులు పట్టిన బియ్యం సరఫరా చేస్తున్నారు. ఉపాధ్యాయులు ఈ బియ్యాన్ని వండిపెట్టడానికి ఇబ్బందులు పడుతున్నారు. నాణ్యమైన బియ్యాన్ని పంపిణీ చేయాలని లేకుంటే విద్యార్థులు అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉందని అంటున్నారు. ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి పాఠశాలలకు పంపిణీ చేసే బియ్యాన్ని పరిశీలించి నాణ్యమైన బియ్యాన్ని పంపిణీ చేయాలని కోరుతున్నారు.



# అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జారే

ప్రజాపక్షం/దమ్మపేట: దమ్మపేట మండలంలో మారప్పగూడెం, ఆర్లపెంట గ్రామపంచాయతీలకు నూతనంగా ఎంఎన్ఆర్ ఈజీఎస్ నిధులు రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించిన పంచాయతీ కార్యాలయాలను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. దమ్మపేట అర్బన్ కాలనీ ప్రాథమిక పాఠశాల ఆవరణం, నాగుపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో నూతనంగా నిర్మించే అంగన్వాడీ భవనాలకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. లింగాలపల్లి, తొట్టిపంపు గ్రామాలలో నూతనంగా మంజూరైన సీసీ రోడ్లు కల్వర్టుల నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. లింగాలపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆర్లపెంట గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికి త్వరలోనే ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని, ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక నిష్పక్షపాతంగా పారదర్శకంగా జరగాలని, గ్రామస్తుల ఇష్టపూర్వకంగ వారి సమక్షంలోనే లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. అధునాతన టెక్నాలజీతో సర్వే చేసి పంట పండే భూములకు రైతు భరోసా ఇస్తాం అన్నారు. దొడ్డి దారిన రైతు భరోసా పొందటానికి అవకాశం ఉండదన్నారు. నిజమైన రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. అనారోగ్యంతో ఇబ్బంది పడే పేదలకు ఉచితంగా ట్రీట్మెంట్ చేపించడానికి 30 లక్షల వరకు ఎల్ఓసి రూపంలో ఇచ్చే అధికారం తనకు ఉందన్నారు. ఎవరైనా ఇబ్బందుల్లో ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకొస్తే సహాయం చేస్తానన్నారు. అలాగే ప్రయివేట్ ఆసుపత్రులలో ట్రీట్మెంట్ పొందినవారు ఆయా బిల్లులను అందిస్తే ప్రభుత్వం నుంచి సీఎంఆర్ఎఫ్ ద్వారా డబ్బులు ఇప్పిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,స్థానికులు పాల్గొన్నారు.



# భారీ వృక్షం రంపం కోతకు గురి



ప్రజాపక్షం/కొణిజర్ల : తనికెళ్ల నుంచి ఖమ్మం వైప వెళ్లే రోడ్డు వెంబడి ఏన్నో ఏళ్ల గా నాటిన భారీ వృక్షాన్ని సోమవారం పట్టపగలే జేసీబితో పడగొట్టి రంపం మిషన్ తో కోస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం చెట్లు నాటమని చెపుతుంటే వెంచర్ గేటుకు అడ్డువస్తుండటంతో చెట్లు నరుకుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. తనికెళ్ల నుంచి ఖమ్మం వైపు ఓ పెట్రోల్ బంక్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న వెంచర్ ఎదుట భారీ వృక్షాన్ని కోస్తున్నారు. దీనికి ఆర్అండ్బి అధికారుల అనుమతి ఉందా లేదా అనేది అధికారులు చూడాలి. అనుమతి లేకుండా నరికితే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# రూ.5లక్షలతో కళావేదిక నిర్మాణ పనులకు శంకుస్థాపన



ప్రజాపక్షం/ మధిర రూరల్ : మండల పరిధిలోని జెడ్పిహెచ్ఎస్ పాఠశాల నందు సివిఆర్ చిట్స్ అధినేత చెరుకూరి వెంకటేశ్వరరావు సహకారం రూ.5లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న కళావేదిక నిర్మాణ పనులకు సోమవారం ఆయన చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. హెచ్ఎం తోట నర్సింహారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు వ్యక్తులు మాట్లాడుతూ దాతలను అభినందించారు. ఈకార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధికారి ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాస్రెడ్డి, మధిర మున్సిపల్ వైస్చైర్మన్ శీలం విద్యాలత, జిల్లా నాయకులు మొండితోక సుధాకర్, శీలం వెంకటరెడ్డి, సత్యనారాయణ, మువ్వా రామకృష్ణ, నీలం వెంకటేశ్వర్లు, హెచ్ఎం తోట నర్సింహారావు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# భాగ్యలక్ష్మి ఈబైక్స్ నూతన షోరూం ప్రారంభం



ప్రజాపక్షం/బోనకల్: మండల కేంద్రంలో దివ్యదయాల్ వృద్ధాశ్రమం వద్ద నూతన బిల్డింగ్లో భాగ్యలక్ష్మి ఈ బైక్స్ నూతన షోరూంను సోమవారం ప్రారంభించారు. బోనకల్ గ్రామానికి చెందిన తోటపల్లి రమేష్ నూతన ఈబైక్స్ షోరూంను పాస్టర్ల సంఘం పెద్దలు, కుటుంబ సభ్యుల చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ నాయకులు బిపి నాయక్ పాల్గొని మాట్లాడుతూ...రానున్న రోజుల్లో విద్యుత్ వాహనాలకే ప్రజాదరణ ఉంటుందని అన్నారు. మండల కేంద్రంలో ఈ బైక్స్ షోరూం ప్రారంభించడం అనేది ఎంతో అభినందనీయ విషయమని అన్నారు. రోజువారీ వినియోగం కోసం ఎలక్ట్రికల్ వెహికల్స్ కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా ప్రజలను కోరారు. ఈ బైక్స్ వల్ల పర్యావరణాన్ని పోల్యూషన్ నుంచి కాపాడడంతో పాటు, మానవాళికి ఉపయోగకరంగా మారుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మై డ్రీమ్ బైక్స్ సంస్థ వ్యవస్థాపకులు మురళి, పంచాయతీ కార్యదర్శి కోల రాజేశ్వరి,పాస్టర్లు అంతోటి వెంకటేశ్వర్లు, రాజారత్నం, బానోత్ రాజు, రేఖ, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

# ఉరేసుకుని యువతి ఆత్మహత్య

ప్రజాపక్షం/మధిర : మనస్థాపానికి గురై ఓ యువతి ఉరేసుకుని మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఆత్కూరు గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మధిర పట్టణం మెయిన్ రోడ్డులోని ఓ రెడిమెడ్ దుకాణంలో ఆత్కూరు గ్రామానికి చెందిన కంభంపాటి నందిని(25) అనే యువతి గత కొన్నేళ్లుగా సేల్స్ గర్ల్గా పనిచేస్తుంది. ఈక్రమంలో జనవరి 1న సెలవు ఇవ్వాలని దుకాణ యజమానిని అడుగగా, ఆ షాపు యజమాని నిరాకరించడంతో ఆరోజు షాపు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంది. మరుసటిరోజు షాపుకువెళ్లగా యజమాని పనికి రావాల్సిన అసవరం లేదని చెప్పడంతో గత నాలుగురోజులు ఇంటి వద్దనే ఉంటుంది. ఈ క్రమంలో మనస్థాపానికి గురైన నందిని సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో బాధిత కుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి. నందిని మృతికి షాపు యజమాని కారణమని కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ నందిని పనిచేస్తున్న రెడిమెడ్ షాపు వద్దకు వెళ్లి ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని బాధిత కుటుంబంతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చి ఆందోళనను విరమించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# డా. సుదర్శన్కు అభినందనల వెల్లువ



ప్రజాపక్షం/భద్రాచలం : పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు డా. సుదర్శన్కు పలువురు అభినందనలు తెలియజేశారు. అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ ఆయన బాధ్యతలు చేపట్టడంతో ఆయనకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మేరకు సిపిఎం బృంధంతో పాటు పట్టణానికి చెందిన మెడికల్ అసోసియేషన్ సభ్యులు ఆయనను స్వయంగా కలిసి పుష్పగుచ్చాలను అందించారు. సుదర్శన్ దంపతులను షాలువాతో కప్పి సత్కరించారు. దైవకార్యాన్ని బుజాలపై ఎత్తుకుని ముందుకు సాగేందుకు నిర్ణయించుకోవడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తూ రామభంటులా కార్యదీక్షతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, మెడికల్ అసిసోయేషన్ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు, గడ్డం స్వామి, బండారు శరత్, సోమశేఖర్, చల్లగుళ్ల నాగేశ్వరరావు, మురళీ తదితరులు పాల్గొన్నారు.

# రూ. 2కోట్ల గంజాయి, డ్రగ్స్ కాల్చివేత

## -831 కేజీల గంజాయి, 11 గ్రాముల ఎండిఎంఏ దహనం



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఖమ్మం, మధిర, నేలకొండపల్లి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో 91 కేసుల్లో పట్టుబడిన 831 కేజీల గంజాయి, 11 గ్రాముల ఎండిఎంఏ డ్రగ్స్ను దహనం చేశారు. డిస్పోజల్ అధికారి, ఖమ్మం డిప్యూటీ కమిషనర్ జనార్ధన్రెడ్డి ఆధ్వర్యంలో తల్లాడ మండలం గోపాలపేట గ్రామంలోని ప్రభుత్వ ఆమోదిత ఏడబ్ల్యూఎం కన్సల్టింగ్ లిమిటెడ్లో రూ. 2కోట్ల విలువ గల గంజాయిని, డ్రగ్స్ను సోమవారం కాల్చివేశారు. గంజాయి, డ్రగ్స్ను కాల్చివేసిన అధికారులను ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ కమలాసన్రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ జి. గణేష్, డిసిఈవో నాగేందర్రెడ్డి, ఎస్హెచ్వోలు తదితరులు పాల్గొన్నారు.

# జనవరి 10లోపు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : మైనార్టీలు బేసిక్ ఫౌండేషన్ శిక్షణ కొరకు జనవరి 10లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖాధికారి కె. సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మైనార్టీస్ స్టడీ సర్కిల్, మైనార్టీల సంక్షేమ శాఖ ద్వారా ప్రభుత్వ పోటీ పరీక్షలైన గ్రూప్ 1 ప్రిలిమ్స్, గ్రూప్ 2, గ్రూప్ 3, గ్రూప్ 4 పరీక్షలు, కేంద్ర ప్రభుత్వం స్టాప్ సెలక్షన్ కమిషన్, రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు, బ్యాంకింగ్ మొదలు పోటీ పరీక్షల కొరకు సన్నద్ధమవుతున్న మైనార్టీ అభ్యర్థులకు నాలుగు నెలల పాటు ఖమ్మంజిల్లాలో ఉచిత బేసిక్ ఫౌండేషన్ శిక్షణ అందించనున్నట్లు ఆయన తెలిపారు. డిగ్రీ పూర్తి చేసుకున్న అర్హత, ఆసక్తి గల మైనార్టీ అభ్యర్థులు (ముస్లిం, క్రైస్తవులు, సిక్కులు, బౌద్దులు, జైనులు, పార్శికులు) తమ దరఖాస్తులతో పాటు ఆధార్ కార్డు, ఆదాయ, కుల ధృవీకరణ, డిగ్రీ మార్కుల మెమో, రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు జతచేసి కలెక్టరేట్లోని రెండవ అంతస్తులో గల జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో జనవరి 10 లోగా దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9704003002 ఫోన్ నెంబర్ను సంప్రదించాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి తెలిపారు.

# నేడు ఎర్రుపాలెం మండలంలో భట్టి పర్యటన

ప్రజాపక్షం/ఎర్రుపాలెం : ఎర్రుపాలెం మండలంలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, శాసనసభ్యులు మల్లు భట్టివిక్రమార్క పర్యటించనున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్రెడ్డి తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ఎంజిఎన్ఆర్జిఎస్ పథకంలో భాగంగా మంజూరైన నిధులతో నూతనంగా నిర్మించనున్న సిసి రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన, పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. పెద్ద ఎత్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు ఈ పర్యటనలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# జగత్జీత్ సింగ్ దలైల్వాల్ ప్రాణాలు కాపాడాలి

ప్రజాపక్షం/కొణిజర్ల : కనీస మద్దతు ధర గ్యారెంటీ చట్టం చేయాలని రైతునాయకుడు జగత్జీ సింగ్ దలైల్వాల్ ప్రాణాలు కాపాడాలని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు కొండపర్తి గోవిందరావు, దొండపాటి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత 44 రోజులుగా ఆయన ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారని ఆయన ఆరోగ్యం క్షీణిస్తున్నా కేంద్రప్రభుత్వం స్పందించడంలేదని వెంటనే స్పందించి నిర్ణయం తీసుకోవాలని లేకుండా రైతుసంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమించాలని నిర్ణయం తీసుకోనున్నట్లు హెచ్చరించారు. సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఈనెల 8న ఉదయం 10 గంటలకు ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ధర్నా కార్యక్రమాన్ని రైతులందరు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# ప్రభుత్వ భూములను కాపాడాలని సిపిఐ వినతి




ప్రజాపక్షం/ మధిర : ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూములను రక్షణ కల్పించాలని సిపిఐ నాయకులు బెజవాడ రవి బాబు డిమాండ్ చేశారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో నందు జరిగిన ప్రజావాణిలో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని తహశీల్దార్ రాంబాబుకు వినతిపత్రాన్ని అందచేశారు. మధిర పట్టణంలోని హిందూ స్మశానవాటిక, మార్కెట్యార్డ్, శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం తదితర ప్రభుత్వ భూములు కొంతమంది కబ్జాదారులు ఆక్రమించుకుని రిజిస్ట్రేషన్లను చేయించుకుంటున్నారని, వెంటనే అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మధిర పట్టణ సహాయ కార్యదర్శి మంగళగిరి రామానుజ,ం ఎఐటీయూసి డివిజన్ కార్యదర్శి చెరుకూరి వెంకటేశ్వరరావు, మండల కార్యవర్గ సభ్యులు సిరివేరు శ్రీను పాల్గొన్నారు.

# తాతా మధును కలిసిన బిఆర్ఎస్ నాయకులు

ప్రజాపక్షం/భద్రాచలం : ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎంఎల్సీ తాత మధును భద్రాచలం పట్టణ బిఆర్ఎస్ నాయకులు సోమవారం ఖమ్మంలో కలిశారు. ఈ మేరకు ఆయనకు పుష్పగుచ్చాన్ని అందించిన బిఆర్ఎస్ మండల కన్వీనర్ ఆకోజ్ సునీల్ కుమార్ నూతన సం.శుభా కాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా భద్రాచలం పట్టణంలో పార్టీ కార్యకలాపాలు, కార్యకర్తల మనోభావాలు, పార్టీ పురోభివృద్ధిపై వారిద్దమరి మధ్య కొద్దిసేపు చర్చ సాగింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు ఐనాల రామకృష్ణ, బిసి సెల్ నాయకులు సాయి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా ఓటరు జాబితా



**-జిల్లాలో 98.15 శాతం ఓటరు కార్డులు పంపిణీ**
**-కామన్ డైట్ అమలు పర్యవేక్షించాలి**
**-ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ బాలమాయదేవి**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పిస్తూ పారదర్శంగా ఓటరు జాబితా ఉండాలని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ బి. బాలమాయదేవి తెలిపారు. సోమవారం ఖమ్మం కలెక్టరేట్‌లో ఓటరు సవరణ జాబితా 2025పై ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లా అధికారులతో ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ బి. బాలమాయదేవి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఖమ్మం అదనపు కలెక్టర్లు డా॥ పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డిలు పాల్గొని ఖమ్మంజిల్లాలో ఓటరు సవరణ జాబితా 2025పై జిల్లాలో చేపట్టిన చర్యలను వివరించారు. ఓటరు తుది జాబితా వివరాలు, జనాభా ఓటర్ల నిష్పత్తి, మహిళలు, పురుషుల ఓటర్ల నిష్పత్తి, డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రచురణ తర్వాత వచ్చిన దరఖాస్తులు, వాటి స్థితిగతులు, ఓటరు కార్డుల డెలివరి వంటి పలు అంశాలను అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ మాట్లాడుతూ ఓటర్ల తుది జాబితాను విజయవంతంగా ప్రచురించినందుకు అధికారులందరికీ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. నూతన ఓటర్ల నమోదు కొంత తక్కువగా ఉన్న నేపథ్యంలో ఓటర్ల జాబితా సవరణ సమయంలో మాత్రమే కాకుండా ఇతర సమయాల్లో కూడా స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఓటరు తుది జాబితా వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు సాఫ్ట్ కాపీ, హార్డ్ కాపీ అందజేయాలని అధికారులకు సూచించారు. బిసి సంక్షేమ శాఖ పరిధిలో నడిచే గురుకులాల్లో పిల్లలకు అందిస్తున్న కామన్ డైట్ అమలు జరిగేలా చూడాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన కామన్ డైట్ ప్రకారం పిల్లలకు కూరగాయలు, నాన్‌వెజ్ భోజనం అందేలా చూడాలని హాస్టల్స్‌ను ర్యాండమ్‌గా పరిశీలించాలన్నారు. జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహిస్తూ భోజన నాణ్యతను పరిశీలించాలని బిసి సంక్షేమ శాఖ కమిషనర్ కూడా అయిన బాలమాయదేవి తెలిపారు. అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ జిల్లాలో జనాభా ఓటర్ల నిష్పత్తి 695 ఉందన్నారు. నూతన ఓటర్లకు ఓటరు కార్డు ముద్రణకు పంపామని జిల్లాలో 98.15 శాతం ఓటరు కార్డుల పంపిణీ పూర్తి చేశామన్నారు. ఓటరు జాబితా సవరణ జిల్లాలో పారదర్శకంగా నిర్వహించామని ప్రతి దశలో రాజకీయ పార్టీల ప్రతినిధులను భాగస్వామ్యం చేశామన్నారు. జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజక వర్గాలు ఉన్నాయని వాటికి సంబంధించి మొత్తం 12,30,572 ఓటర్లతో తుది జాబితాను తయారు చేశామని, మహిళలు, పురుషుల నిష్పత్తి 1076గా ఉందన్నారు. ఈ సమావేశంలో పివో ఐటిడివో భద్రాచలం బి. రాములు, మూడు జిల్లాల ఈఆర్‌వోలు, ఏఆర్‌వోలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వైరాలో ఎస్ఎస్ఎల్ ఫ్యామిలీ రెస్టారెంట్ పునఃప్రారంభం






**ప్రజాపక్షం/వైరా:** వైరాలో తల్లాడ రోడ్డులోని శ్రీసాయిలక్ష్మి వేబ్రిడ్జి ప్రక్కన ఎస్ఎస్ఎల్ ఫ్యామిలీ రెస్టారెంట్‌ను సోమవారం ఉదయం పునఃప్రారంభించారు. ప్రారంభోత్సవ సందర్భంగా ప్రతి ఫ్యామిలీ ప్యాక్ రూ.650ల కొనుగోలుపై మినీ బిర్యాని ఉచితంగా ఇస్తున్నామని ఎస్ఎస్ఎల్ ఫ్యామిలీ రెస్టారెంట్‌ప్రొప్రైటర్ పెద్దిరెడ్డి హరిబాబు తెలిపారు. అదే విధంగా క్యాటరింగ్ సదుపాయం, డోర్ డెలివరీ సౌకర్యం ఆర్డర్ ఇచ్చిన వారికి పంపుతామని నిర్వాహకులు తెలిపారు. వ్యాపార అభివృద్ధికి సహకరించాల్సిందిగా వారు తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర హస్తకళల చైర్మన్ నాయుడు సత్యనారాయణ, మాజీ శాసనసభ్యులు రాములునాయక్, పిసిసి కార్యదర్శి కట్ల రంగారావు, మున్సిపాల్ చైర్మన్ సూతకాని జైపాల్, వైరా లయన్స్ కంటి హాస్పిటల్ చైర్మన్ కాపా మురళీకృష్ణ, వుంద్రు శ్యామ్‌బాబు, లగడపాటి ప్రభాకర్‌రావు, క్లబ్ అధ్యక్షులు చింతలపూడి వెంకటేశ్వరరావు, చింతనిప్పు వెంకటయ్య, చింతోజు నాగేశ్వరరావు, మిట్టపల్లి నాగి, వార్త రిపోర్టర్ కొత్తా వెంకటేశ్వరరావు, ఊరుకొండ వెంకటేశ్వరరావు, చెరుకూరి శ్రీనివాసరావు, అబ్బూరి రమేష్, మరికంటి రాంగోపాల్, పిల్లలమర్రి శ్రీకాంత్, పోలా శ్రీనివాసరావు, కట్ల సంతోష్, దొడ్డా పుల్లయ్య, పొదిలి హరినాథ్, నూతి సత్యనారాయణ, పులి కృష్ణార్జున్‌రావు, డాక్టర్ దారెల్లి కోటయ్య, చింతనిప్పు మురళీధర్‌రావు, బుచ్చిరామారావు, పోసం శ్యామ్, దాసరాజు కుటుంబరావు, పెనుగొండ ఉపేందర్‌రావు, కొల్లా రాంబాబు, పెద్దిరెడ్డి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఒప్పందాలు అమలు చేయండి

**- హమాలీల జీవితాలతో ఆడుకోవడం సరికాదు**
**- ఏఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి**




**ప్రజాపక్షం/భద్రాచలం :** సివిల్ సప్లై, జిసిసి హామీలల రేట్లు పెంపుపై ఇచ్చిన ఒప్పందాన్ని అధికారులు నిలబెట్టుకోవాలని ఏఐటియూసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా కలెక్టరేట్ ముందు జిల్లా నలు మూలల నుండి తరలివచ్చిన హామీలతో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా నరాటి మాట్లాడుతూ గత నాలుగు నెలల క్రితం జరిగిన ఒప్పందం ప్రకారం కమీషనర్ గెజిట్ విడుదల చేస్తామని హామీ ఇచ్చారని, కానీ నేటికీ ఆ హామీ నెరవేరలేదన్నారు. ఈ నిర్లక్ష్యం కారణంగా డిసెంబర్ 18న కమీషనర్ కార్యాలయాన్ని ముట్టడించి ధర్నా చేశామని, అప్పుడు కూడా డిసెంబర్ 31 నాటికి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చిరన్నారు. అయినప్పటికీ హామీ అమలుకాకపోవడంతో జనవరి 1వ తేది నుండి హమాలీ కార్మికులు సమ్మెలో ఉన్నారని, దీనంతటికీ కమీషనరే కారణం అన్నారు. ఇప్పటికైనా పెంచిన హమాలీ రేట్ల జిఓను వెంటనే విడుదల చేసి బకాయిలు చెల్లించాలని, పెంచిన బోనస్, కట్టుకూలి, మహిళా కార్మికులకు పెంచిన జీతాలు, ఐడి కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెక్కలమీద ఆధారపడి జీవిస్తున్న జిసిసి, సివిల్ సప్లై హమాలీలకు ఇచ్చే నగదు లేని స్థితిలో ప్రభుత్వం ఉందా అని నరాటి విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియూసి జిల్లా సహాయ కార్యదర్శి గెద్దడి నగేష్, సదానందం, రమణయ్య, దుర్గయ్యతో పాటు సిఐటియూ నాయకులు వంగూరి రాములు, బ్రహ్మచారి, జిల్లా నలు మూలల నుండి తరలివచ్చిన హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

# షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** షరతులు లేకుండా రైతులకు రుణ మాఫీ చేయాలని, పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని ఎఐయుకెస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌కు అందచేశారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయకుడు కంగాల కల్లయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మూడు చట్టాలను తీసుకువచ్చి వ్యవసాయ రంగాన్ని పెట్టుబడిదారులకు కట్టబెట్టేందుకు చేస్తున్న కుట్రకు వ్యతిరేకంగా రైతులు చేపట్టిన ఆందోళన దీక్షలను భగ్నం చేస్తున్నారని అన్నారు. అదేవిధంగా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటుధర కల్పించాలని, రైతుల న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి గోకినెపల్లి ప్రభాకర్, మండల కార్యదర్శి వాసం బుచ్చిరాజు, ఎఐయుకెఎస్ నాయకులు గొంది లక్ష్మణ్‌రావు, కణితి గోపాలరావు, కంగాల పెద్దవంగరావు, కొమరం పరమేష్, వాసం పోతురాజు, జోగారావు, రాజు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఏపూరి ధన్యజీవి

**ప్రజాపక్షం/భద్రాచలం :** సిపిఐ సీనియర్ నాయకులు ఏపూరి బ్రహ్మం ధన్యజీవి అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం ఇల్లెందులో జరిగిన ఏపూరి బ్రహ్మం సంస్మరణ సభకు ఆయన హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తొలినాటి నుండి చివరి వరకు సిపిఐ జెండాతోనే ఏపూరి ఉన్నారని, అనేక ప్రజా ఉద్యమాల్లో ఆయన పాల్గొని పేదల సమస్యల కొరకు పోరాడి పరిష్కార మార్గాలు చూపారని చెప్పారు. అన్ని రాజకీయ పక్షాలను కలుపుకని అఖిలపక్షం ఏర్పాటు చేసి సీతారామప్రాజెక్టు, పోడు భూములు, రైతుకూలీల సమస్యల పరిష్కారానికి ప్రధానంగా ముందుండి పోరాటాలు చేశారని చెప్పారు. ఆయనలేని లోటు పార్టీకి తీరనిదని, ఆయన ఆశయాలు సాధించిన నాడే నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందన్నారు. ఈ మధ్యకాలంలో నిబద్ధత గల సిపిఐ నాయకులు ఒక్కొక్కరుగా మృత్యువాత పడుతున్నారని, ఇది మరింత బాధగించే విషయమన్నారు. ఆ నాయకులంతా మన మధ్య లేకున్నా వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మాజీ ఎంఎల్‌ఏ గుమ్మడి నర్సయ్య, మాజీ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ దిండగాల రాజేంధర్ బ్రహ్మం ప్రజల కోసం చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మహబూబాబాద్ జిల్లా రాష్ట్ర కార్యదర్శి విజయ సారధిరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భాగం హేమంతరావు, కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, సిపిఐ రాష్ట్ర సమితి, భద్రాచలం డివిజన్ కార్యదర్శి కల్లూరి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు సారయ్య, ముత్యాల విశ్వనాధం, మహిళా సమాఖ్య నాయకురాలు ఏపూరి లలితాదేవి, కట్టబోయిన శ్రీను, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# నేత్ర స్వచ్ఛంద సేవలు అభినందనీయం



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఏజెన్సీ ప్రాంతంలో నేత్ర స్వచ్ఛంద సేవలు చేస్తూ పలువురుకి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తూ అంధత్వ నివారణకు చేస్తున్న కృషి అభినందనీయమని జిల్లా కలెక్ట్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, మారుతీ నర్సింగ్ కాలేజీ, లయన్స్ క్లబ్ భద్రాచలం ఆధ్వర్యంలో ఎస్ఆర్ వాసవి అసోసియేషన్, యుఎస్ఏ పుష్పగిరి కంటి ఆస్పత్రి సికింద్రాబాద్ వారి సహకారంతో నిర్వహించిన ఉచిత కంటి శస్త్ర చికిత్స శిబిరం విజయవంతమైంది. మారుతీ కాలేజీ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ స్వచ్ఛంద సేవలను అభినందించారు. అంధత్వ నివారణ కొరకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని, ఈకార్యక్రమానికి కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తుందని చెప్పరు. సికిల్ సెల్స్ ఎనీమియా, తులసేమియా ఎక్కువగా ఈ ప్రాంతంలో ఉందని, నివారణ కొరకు వార్డును అభివృద్ధి పరుస్తామని చెప్పారు. రక్తదాన శిబిరాలు నిర్వహించి రక్తహీనత నివారణకు ప్రణాళిక బద్దంగా ముందుకు సాగుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐ వెంకటపుల్లయ్య, ఏహెచ్ సూపరింటెండెంట్ డా. రామకృష్ణ, డా. సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# వైరాలో రెండు జిల్లాల స్థాయి పాటల పోటీలు

**ప్రజాపక్షం/వైరా:** సంక్రాంతి పండుగ సందర్భంగా రవళి కళానిలయం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం రెండు జిల్లాలస్థాయి సినిమా పాటలు పోటీలు దేశభక్తి అభ్యుదయ పోటీలు నిర్వహించనున్నట్లు రవళి కళానిలయం చారిటుబల్ ట్రస్ట్ అధ్యక్షుడు గద్వాల రమేష్ తెలిపారు. జనవరి 13వ తారీఖు సాయంత్రం మూడు గంటల నుండి రాత్రి 10 గంటల వరకు పాటల పోటీలు కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు ఎంట్రీ ఫీజు రూ.200లుగా నిర్ణయించబడింది అని పాటల పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.10116లు, రెండు బహుమతి రూ.5116లు, మూడో బహుమతి రూ.3116లు, నాల్గో బహుమతి రూ.2116లు, కన్సొలేషన్ బహుమతులు కలవు. పాటలు నిర్వహించు స్థలం వైరాలోని కొత్త బస్టాండ్ సెంటర్‌లో ఉన్న ఇండోర్ స్టేడియం ప్రాంగణంలో పాటల పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఎంట్రీలు పంపవలసిన చిరునామా గద్వాల రమేష్ , చరణ్‌తేజ మెడికల్ షాప్ కొత్త బస్టాండ్ రింగు రోడ్డు వైరా సెల్ నెంబర్.9948643074. కావున కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తెలియజేశారు.

# ముగ్గుల పోటీ కరపత్రాన్ని ఆవిష్కరించిన మేయర్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ మైదానంలో ఈనెల 12న ఎస్‌వి ఫోటోగ్రఫీ ఆధ్వర్యంలో నిర్వహించే ముగ్గుల పోటీల కరపత్రాన్ని మేయర్ పునుకొల్లు నీరజ ఆవిష్కరించారు. సోమవారం కార్పోరేషన్ కార్యాలయంలో తన చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో ముగ్గుల పోటీల కరపత్రాన్ని మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమజోహరా లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ముగ్గుల పోటీల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ముగ్గుల పోటీల నిర్వహకులు పాటిబండ్ల వీరవర ప్రసాద్ మాట్లాడుతూ జివిమాల్, శ్రీవెంకట్రామ జ్యూయల్లర్స్, ప్రసాద్ మ్యాచింగ్స్, కల్కి మ్యాచింగ్స్, సాయికృష్ణ ఆటో మొబైల్స్, హరి స్వీట్స్ సహకారంతో ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి ఫ్రిడ్జ్, ద్వితీయ బహుమతి వెట్ గ్రైండర్, నాలుగు బర్నర్స్ కలిగిన గ్యాస్ స్టౌవ్‌తో పాటు 10 కన్సోలేషన్ బహుమతులు, పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతులను అందజేస్తామని తెలిపారు. పోటీల్లో పాల్గొనే మహిళలు ముగ్గులు, రంగులు తమ వెంట తెచ్చుకోవాలన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న మహిళలు 9849100230, 9848796365, 7095229292 నెంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిరుమామిళ్ల నాగేశ్వరరావు, అంజిరెడ్డి, పాలెపు వెంకటరమణ, పల్లెబోయిన చంద్రం తదితరులు పాల్గొన్నారు.